

నేడు స్టీల్‌ప్లాంటు కార్మికుల మహా ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): లక్ష్యం మేరకు ఉత్పత్తి సాధిస్తేనే పూర్తి వేతనం చెల్లిస్తామని, లేదంటే ఉత్పత్తికి తగ్గ వేతనం మాత్రమే ఇస్తామని శనివారం యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులపై స్టీల్‌ప్లాంటు కార్మికులు మండిపడుతున్నారు. ఈ మేరకు సోమవారం ప్లాంటు గేటు ఎదుట ధర్నా చేస్తామని అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఉక్కు యాజమాన్యం కార్మికులు, ఉద్యోగుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, కార్మికుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతీసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. యాజమాన్యం ఉత్తర్వులకు వ్యతిరేకంగా చేపట్టే ధర్నాలో భారీఎత్తున ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

విశాఖకు విశ్వఖ్యాతి

గూగుల్ రాకతో కంపెనీల ఏర్పాటుకు పలు దేశాల ఆసక్తి

- ప్రభుత్వ ఆహ్వానంతో సదస్సుకు హాజరైన ప్రతినిధులు
- డేటా సెంటర్ ఏర్పాటుకు రిలయన్స్ సంసిద్ధం
- పలు ఐటీ కంపెనీలకు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్



సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు (ఫైల్)

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): **సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సును విజయవంతంగా నిర్వహించడం ద్వారా విశాఖపట్నం పేరు అంతర్జాతీయంగా మార్మోగింది. రెండురోజుల సదస్సుకు 45 దేశాల నుంచి 640 మంది ప్రతినిధులు హాజరుకావడం సదస్సు ప్రాధాన్యతను తేటతెల్లం చేసింది. సదస్సులో పాల్గొన్న పారిశ్రామిక సంస్థలు విశాఖలో కంపెనీల ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. కొందరు ఒప్పందాలు కూడా చేసుకున్నారు. ప్రసిద్ధ ఐటీ సంస్థ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు విశాఖను ఎంపికచేసిన అనంతరం నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో అనేకమంది విశాఖ పేరును పదేపదే చెబుతూ ప్రశంసిస్తున్నారు.**

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖ ప్రాముఖ్యత ఏమిటో తెలుసుకునేందుకు పలు దేశాల ప్రముఖులు నగరానికి తరలివచ్చారు. భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పలు దేశాలలో రోడ్‌షోలు నిర్వహించి అక్కడ ప్రముఖులను కలిసి ఆహ్వానించారు. సీఎం అరబ్ దేశాలు, ఇంగ్లండ్, లోకేశ్ ఆస్ట్రేలియా, మరికొన్ని దేశాల్లో పర్యటించారు. ఏపీలో వనరులు, వసతులు, ప్రభుత్వ రాయితీలను వివరించడంతో వారంతా సదస్సుకు హాజరయ్యారు. అంతేకాకుండా ... మిగతా 6వ పేజీలో



'విశాఖ కొత్త నగరంగా, ఏఐ సిటీగా ఎదుగుతుంది. ఇక్కడి ఎకో సిస్టమ్ భవిష్యత్తు తరానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. టీసీఎస్‌కు దేశ నిర్మాణం ముఖ్యం. విశాఖలో పెట్టుబడులు పెట్టడం మా మనసుకు దగ్గరైన విషయం. ఇది అభివృద్ధి చెందుతున్న నగరం. అందరినీ కలుపుకుని పోయే విధానానికి మేము అనుకూలం.. అందుకే ఈ ప్రాంతం అభివృద్ధి ముఖ్యమైనది. పెట్టుబడి పెట్టడానికి కారణం కేవలం వ్యాపారమే కాదు.. నగరానికి ఉన్న సానుకూల దృక్పథం ఒక కారణం. విశాఖలో నైపుణ్యతకు కొదవలేదు. సకాలంలో ప్రాజెక్టుపూర్తిచేసి డెలివరీ చేయాలన్న పట్టుదల ఉంది. అది మమ్మల్ని ఆకట్టుకుంది'.

- శ్రీధరన్ వెంకటరామన్, టీసీఎస్ కీలక ప్రతినిధి

సమన్వయంతోనే సదస్సు సక్సెస్

- కలెక్టర్ హరేంధిరప్రసాద్



విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు విజయవంతమైందని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయడంతోనే సాధ్యమయిందన్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సదసు వేదిక నిర్మాణం నుంచి సెషన్ల నిర్వహణ బాధ్యతలు, ఫుడ్, రవాణా, హోటళ్లలో గదుల కేటాయింపు, ఎయిర్‌పోర్టులో స్వాగతం, ప్రముఖుల పర్యటనలు సాఫీగా సాగడానికి అధికారులకు బాధ్యతలు అప్పగించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించామన్నారు. దేశ, విదేశాల నుంచి అతిథులు, పారిశ్రామికవేత్తలు వస్తున్న నేపథ్యంలో నగరంలో రోడ్లు, లైటింగ్, సుందరీకరణను జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పర్యవేక్షించారన్నారు. ముఖ్య కూడళ్లను అద్భుతంగా అలంకరించారన్నారు. సదస్సులో ప్రతి హాలులో సెమినార్లు సజావుగా జరిగేలా ఒక్కో అధికారికి బాధ్యత అప్పగించామన్నారు. జీసీసీ ఎండీ కల్పనాకుమారి మొత్తం ప్రక్రియను పర్యవేక్షించారని, ప్రధాన హాలు బాధ్యత భీమిలి ఆర్డీవోకు అప్పగించామన్నారు. ఒప్పందాల నిర్వహణ, పారిశ్రామికవేత్తలతో సమన్వయం పరిశ్రమల శాఖ పర్యవేక్షించిందన్నారు. ప్రధాన వేదిక ముందు అలంకరణ వీఎంఆర్డీఏ చేపట్టిందన్నారు. ఎయిర్‌పోర్టులో హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేసి అతిథులకు స్వాగతంపలికే సమయంలో సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు బాధ్యత కొందరు అధికారులకు అప్పగించామన్నారు. ప్రత్యేక విమానాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. డెలిగేట్లు, అతిథులు, రాయబారులు, ఉన్నతాధికారులకు వాహనాలు, హోటళ్లలో గదుల కేటాయింపు తదితరాలను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ చక్కగా పర్యవేక్షించారని ప్రశంసించారు. సదస్సుకు రెండురోజుల ముందుగానే సీఎం చంద్రబాబునాయుడు నగరానికి వచ్చారని,13న నోవాటెల్‌లో సదస్సులు, ఒప్పందాలు జరిగాయని, 14న సదస్సుతోపాటు నోవాటెల్‌లో ఆర్థిక అంశాలపై సమావేశాలు జరిగాయన్నారు. ఎగ్జిబిషన్‌లో స్టాల్స్ రిజిస్ట్రేషన్, ఆంధ్రపెవిలియన్, సీఎం కార్యక్రమాల పర్యవేక్షణకు, అధికారులను నియమించామన్నారు. వాహనాల పార్కింగ్ ప్రముఖుల వాహనాల రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా నగర పోలీసులు చక్కగా పనిచేశారని ప్రశంసించారు. అనేక దేశాల నుంచి వచ్చిన అతిథుల భద్రత, నగరంలో ట్రాఫిక్ సీపీ శంఖబ్రతబాగ్చి పర్యవేక్షణలో పక్కా ప్లానింగ్‌తో నిర్వహించారన్నారు. సదస్సు సజావుగా జరగడంతో విశాఖకు మంచి పేరు వచ్చిందని, దీనికి సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, సీఐఐ టీమ్, మీడియాకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

సీసీఎస్ నిర్వహణకు టెండర్లు



- రూ.2 కోట్లు కేటాయించి, ఆహ్వానించిన జీవీఎంసీ
- పనుల్లో విఫలమైన కాంట్రాక్టర్‌పై చర్యలకు మీనమేషాలు
- జీవీఎంసీ కమిషనర్ ఆదేశించినా స్పందన నిల్
- రూ.56 లక్షల రికవరీపైనా ఉదాశీనత
- తాజా టెండర్లలో పాల్గొనేలా సహకరిస్తున్న అధికారులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలో పర్యావరణహితంగా చెత్త నిర్వహణకు వివిధ జోన్లలో ఏర్పాటుచేసిన క్లోజ్డ్ కాంపెక్టర్ సిస్టం (సీసీఎస్) ప్రాజెక్టుల వార్షిక నిర్వహణకు జీవీఎంసీ అధికారు లు టెండర్లు పిలిచారు. జీవీఎంసీ పరిధిలోని నాలుగు జోన్లలో సీసీఎస్ ప్రాజెక్టులకు వేర్వేరుగా టెండర్లు ఆహ్వా నించారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుల నిర్వహణలో నిబంధనలను అతిక్రమించినట్టు జీవీఎంసీ కమిషనర్ నిర్ధారించి చర్యలకు ఆదేశించిన కాంట్రాక్టర్‌కు టెండరులో పాల్గొనే అర్హతపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేదానిపై సర్వత్రా ఆసక్తినెలకొంది.

జీవీఎంసీ పరిధిలో చెత్తను జోన్లలో ఏర్పాటుచేసిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్స్ (డంపింగ్‌స్టేషన్)కు క్లాప్‌వాహనాలు, డంపర్ బిన్ల ద్వారా తరలిస్తారు. అక్కడి నుంచి కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు చేరుస్తారు. డంపింగ్‌స్టేషన్ల నుంచి కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు ఓపెన్ టిప్పర్లు, లారీల్లో తరలిస్తే దుర్గంధంతో పాటు చెత్త ఎగిరి వాహనచోదకులు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఖాళీస్థలాల్లో పడుతోంది. ఫలితంగా రోడ్లపై చెత్త పేరుకుపోయి పారిశుధ్యలోపం, పర్యావరణ దెబ్బతింటున్నాయి.

హుక్‌లోడర్లతో తరలింపు

ఈ నేపథ్యంలో జీవీఎంసీ భీమిలి, ముడసర్లోవ, టౌన్‌కొత్తరోడ్డు, గాజువాక, చీమలాపల్లిలో సీసీఎస్ ప్రాజెక్టులను ఏర్పాటుచేసింది. క్లాప్‌వాహనాలు, డంపర్‌బిన్లతో వచ్చిన చెత్తను గల్లా మాదిరిగా ఉండే హూపర్‌లో వేస్తే ప్రత్యేక యంత్రాలు చెత్తను కంప్రెస్‌చేసి కంటెయినర్ (హుక్‌లోడర్)లోకి పంపుతుంది. దానిని లారీలో కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. దీనివల్ల ఒకేసారి ఎక్కువ మొత్తంలో చెత్తను తరలించే వీలుంటుంది. చెత్తతరలించేందుకు హుక్‌లోడర్లు, డీజిల్‌ను జీవీఎంసీ సమకూర్చుతుండగా, డ్రైవర్లు, ప్రాజెక్టు నిర్వహణకు సిబ్బంది, మరమ్మతుల బాధ్యతను కాంట్రాక్టర్లకు అప్పగిస్తోంది. గత ఏడాది ముడసర్లోవ, గాజువాక, టౌన్‌కొత్త రోడ్డు సీసీఎస్ ప్రాజెక్టులను టెండరు ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ నెలాఖరుతో గడువు ముగియనున్నది.

అధికారుల నిర్లక్ష్యం

ఈ ప్రాజెక్టుల నిర్వహణపై ఇంజనీరింగ్ అధికారులు ఉదాశీనంగా వ్యవహరించడంతో కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. విభాగాల నిర్వహణకు జీవీఎంసీ డబ్బు చెల్లిస్తున్నప్పటికీ ఒకసారి పరికరం పాడైపోతే కొత్తది ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల హూపర్ పనిచేయకపోవడంతో చెత్తను రాత్రివేళ ఓపెన్‌టిప్పర్లతో కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలించి నిర్వహణ నిధులు మిగుల్చుకుంటున్నారు. క్లాప్‌వాహనాల ద్వారా అంచనాకు మించి చెత్త వస్తుండడంతో డంపింగ్‌స్టేషన్‌లో చెత్త పేరుకుపోతోందని, అద్దెకు తీసుకున్న అదనపు లారీలతో చెత్తను తరలించి, నిధులు డ్రా చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు రావడంతో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ రెండు నెలల కిందట టౌన్‌కొత్తరోడ్డు, గాజువాక సీసీఎస్ ... మిగతా 6వ పేజీలో

ఐ బొమ్మ రవి ఇంట్లో సోదాలు?



ఆరిలోవలోని ఐ బొమ్మ రవి ఇల్లు

- నగరంలో విస్తృత ప్రచారం
- ఖండించిన నగర పోలీసులు

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొత్త సినిమాల పైరసీ కేసులో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసిన ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి స్వస్థలం విశాఖ. అతడి అరెస్టు నేపథ్యంలో అక్కడి పోలీసులు నగరానికి వచ్చి సోదాలు చేశారని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే నగర పోలీసులు దానిని ఖండిస్తున్నారు.

పెదగదిలికి చెందిన రవి ఎంవీపీ కాలనీలోని శాంత ఇంజనీరింగ్ కాలేజీలో ఇంటర్ వరకు చదువుకున్నాడు. రవి తండ్రి ఇమంది చిన్నఅప్పారావు బీఎస్‌ఎన్‌ఎల్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. రవి తల్లి సుమారు 20 ఏళ్ల కిందటే ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరాలేదు. ఇంటర్ తర్వాత రవి ముంబయి వెళ్లి ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కొంతకాలం పనిచేసి విదేశాలకు వెళ్లి స్థిరపడ్డాడు. అక్కడే పదేళ్ల కిందట ఒక యువతిని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. వారికి ఒక అబ్బాయి కూడా ఉన్నట్టు సమాచారం. భార్యతో విభేదాలు తలెత్తడంతో గత రెండేళ్లుగా ఒంటరిగా జీవిస్తున్నట్టు తెలిసింది. కంప్యూటర్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో పట్టు సాధించి కొత్త సినిమాల సర్వర్లను హ్యాక్‌చేసి ఐబొమ్మ, బప్పం, ఐవిన్ వంటి పేర్లతో వైబ్‌సైట్‌లు రూపొందించి సినిమాలను ఆన్‌లైన్‌లో ఉచితంగా అందుబాటులో ఉంచేవాడు. దీనిపై సినిమా నిర్మాతలు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో వారు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

ఈ క్రమంలో శనివారం హైదరాబాద్ వచ్చిన రవిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం ఆరిలోవలోని ... మిగతా 6వ పేజీలో



ఆర్కే బీచ్ తీరంలో జన సందోహం

కిక్కిరిసిన పర్యాటక ప్రాంతాలు

- ఆర్కే బీచ్, జూ పార్క్‌కు పోటెత్తిన సందర్శకులు



కంబాలకొండలో పర్యాటకుల బోట్ షికారు

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం, అందునా ఆదివారం కావడంతో నగర పరిధిలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. వుడా పార్క్‌కు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సమేతంగా వనసమారాధనలు నిర్వహించారు. సామూహిక భోజనాల అనంతరం, ఆటపాటలతో సందడి చేశారు. ఆర్కే బీచ్‌కు జనం పోటెత్తారు. వీఎంఆర్డీఏ పార్కు వరకు సముద్ర స్నానాలు చేస్తూ, బీచ్ అందాలను ఆస్వాదిస్తూ ఎంజాయ్ చేశారు. కైలాసగిరి, తెన్నేటి పార్కు, రుషికొండకు జనం భారీగా తరలివచ్చారు. ఇక ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలను సుమారు 11 వేలమంది, కంబాల కొండను మూడు వేల మంది సందర్శించారు.

నగరంలో ఐకానిక్ భవనం

- 50 అంతస్థులతో నిర్మించనున్న వీఎంఆర్డీఏ
- కొత్తవలస, శొంఠ్యాంలో థీమ్‌బేస్డ్ సిటీస్
- పురపాలక, పట్టణాభివృద్ధిశాఖా మంత్రి నారాయణ



అధికారులతో సమీక్షిస్తున్న పురపాలక శాఖా మంత్రి నారాయణ

సిరిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో 50 అంతస్థులతో ఐకానిక్ భవనం నిర్మిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ ప్రకటించారు. వీఎంఆర్డీఏ సమావేశమందిరంలో సంస్థ చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై అధికారులతో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టుకు అనుసంధానంగా ఏడు బృహత్తర ప్రణాళిక రహదారుల నిర్మాణంపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. విమానాశ్రయం ప్రారంభించే సమయానికి పూర్తి చేయాలన్నారు. ఒప్పందం మేరకు గడువులోగా పనులు పూర్తిచేసేలా కాంట్రాక్టర్లను అప్రమత్తం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఎంఐజీ లే అవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ పెట్టాలన్నారు. కొన్ని డిసెంబరు ... మిగతా 6వ పేజీలో

అనకాపల్లి, రాజమండ్రిలో పీసీబీ ఆఫీసులు

- విశాఖలో చీఫ్ ఇంజనీరు కార్యాలయం
- కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య



రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): **పనిభారం తగ్గించడం, నాణ్యమైన సేవలు అందించడం, సకాలంలో సమర్థంగా పని చేసే దిశగా ప్రతి జిల్లాలో కార్యాలయాలు ఏర్పాటుచేస్తున్నట్టు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య తెలిపారు. ఇందులో భాగంగా అనకాపల్లి, రాజమండ్రిలో కార్యాలయాల ఏర్పాటుకు బోర్డు, ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.**

పరిశ్రమల పర్యవేక్షణ, తనిఖీలు, ప్రమాదాలు జరిగినపుడు వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేలా అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరివరకు ఫార్మా, ఇతర పరిశ్రమలకు మరిన్ని సేవలు అందించేందుకు వీలుగా విశాఖపట్నంలో చీఫ్ ఇంజనీరు ఉండాలని అభిప్రాయపడ్డారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా చాలా శాఖలకు జిల్లా స్థాయి అధికారులను నియమించారని, కాలుష్యనియంత్రణమండలి ఈఈ కేడర్‌లో కార్యాలయం ఉండాలన్నారు. మండలిల సంస్కరణలు అమలుచేశామన్నారు.బోర్డుకు అధికారుల కొరత ఉందని, చీఫ్ ఇంజనీరు నుంచి నాలుగు జోన్‌లకు జాయింట్ చీఫ్ ఇంజనీరు పోస్టులు, ఎస్‌ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నామనానరు. ఇటీవల 21 ఏఈ పోస్టులు భర్తీచేశామని, త్వరలో జిల్లాలకు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్న తరుణంలో కాలుష్యనియంత్రణమండలి పాత్ర కీలకమన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు అనుమతుల కోసం పారిశ్రామికవేత్తలు/వారి ప్రతినిధి జిల్లాల్లోని పీసీబీ కార్యాలయాల చుట్టూ తిరగకుండా మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖపట్నంలో కాలుష్యనిర్ధారణ కోసం ప్రస్తుతం ఒక ఆన్‌లైన్ యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ యంత్రం ఉందని, మరో రెండు మూడు యంత్రాలను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు.

ఏయూలో బ్యాక్‌లాగ్!

ఎస్సీ, ఎస్టీ పోస్టుల భర్తీపై ఆరోపణల వెల్లువ

- గుట్టుగా ప్రక్రియను పూర్తిచేయడంతో తీవ్రస్థాయిలో విమర్శలు
- సెలవురోజు అభ్యర్థులకు నేరుగా నియామక పత్రాలు
- ఇప్పటికీ వెబ్‌సైట్‌లో కనిపించని వివరాలు
- కోర్టును ఆశ్రయించే యోచనలో అభ్యర్థులు



విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): **ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేసి న వ్యవహారంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుట్టు చప్పుడు కాకుండా ప్రక్రియను చేపట్టి, అనర్హులకు లబ్ధి చేకూర్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో దరఖాస్తు చేసిన వారిలో కొందరు కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నట్టు సమాచారం. వివరాల్లోకి వెళితే..**

ఏయూలో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయడం కొన్నేళ్లుగా సమస్యగా మారింది. ఇందుకోసం 2018లోనే నోటిఫికేషన్ ఇచ్చారు. కొన్ని కారణాలతో ప్రక్రియ ముందుకు సాగలేదు. మళ్లీ 2021లో 33 పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులు మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చారు. దీనికి భారీ స్పందన వచ్చింది. సుమారు వెయ్యి మంది దరఖాస్తు చేసుకున్నారు. మెస్‌వర్కర్లు, తోటపని, హాస్టల్ సహాయ కుల పోస్టులకు కూడా ఎంబీఏ, ఎంటెక్, ఎంసీఏ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆయా పోస్టులకు ఏడు, పదో తరగతి ఉత్తీర్ణత ఉంటే చాలని, ఇం టర్వ్యూలు లేకుండా మెరిట్ ప్రకారం పోస్టులను భర్తీ చేస్తామని అధికారులు ప్రకటించారు. దరఖాస్తు చేసిన కొందరు అభ్యర్థులకు సంబంధించిన విద్యార్హతలపై ఫిర్యా దులు, ప్రక్రియపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించడం, న్యాయపరమైన చిక్కులతో ప్రక్రియ నిలిచిపోయింది. కొద్దిరోజుల కిందట ఈ ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. 33 బ్యాక్‌లాగ్ పోస్టులకు 28 పోస్టులను గుట్టుగా భర్తీ చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నియామక ప్రక్రియ సాగిన తీరు అధికారులకూ తెలి యదని చెబుతున్నారు. నోటిఫికేషన్ ఇచ్చారా ... మిగతా 6వ పేజీలో

ముందే ప్రసవ వేదన



కొన్నాళ్లుగా పెరుగుతున్న ముందస్తు ప్రసవాలు

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో ముందస్తు ప్రసవాలు ఆందోళన కలిగిస్తు న్నాయి. గర్భం దాల్చినప్పటి నుంచి 40 వారాలు దాటిన తరువాత మాత్రమే ప్రసవించాలి. కానీ అనేక కార ణాల వల్ల కొందరు గర్భిణీల్లో ముందస్తు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇలా పుట్టే చిన్నారులను ప్రి మెచ్యూర్ బేబీ అంటారు. ఈ తరహా జన్మించే చిన్నారుల్లో అనేక అనారోగ్య సమస్యలు ఉంటాయని నిపుణులు హెచ్చ రిస్తున్నారు. వాటిపై అవగాహన కలిగించే ఉద్దేశంతోనే ఏటా నవంబరు 17న వరల్డ్ ప్రిమెచ్యూరిటీ డే నిర్వ హిస్తున్నారు.

- ప్రి మెచ్యూర్ బేబీల ఆరోగ్యం పట్ల అప్రమత్తం అవసరం
- అవగాహన లేకపోతే మరణాలకు అవకాశం
- నేడు వరల్డ్ ప్రిమెచ్యూరిటీ డే



గర్భం దాల్చిన తరువాత 38 నుంచి 40 వారాల మధ్య ప్రసవం జరుగుతుంది. అయితే కొన్ని కార ణాల వల్ల 37 వారాలు కంటే ముందుగా ప్రసవించా ల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలా పుట్టే శిశువుల్లో అనేక అనారోగ్య సమస్యలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా 27 వారాలు నుంచి 25 వారాలు లోపు జన్మించే వారిలో తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉండే అవకాశం ఉంది. వీరికి మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా కోలుకునేలా చేస్తారు. కొన్నిసార్లు గర్భిణీల్లో బీపీ, షుగర్ పెరిగినా, బేబీ ఎదుగుదల తక్కువగా ఉన్నా, ఉమ్మనీరు ఆశిం చిన స్థాయిలో లేకపోయినా ముందస్తు ప్రసవాలు జరుగుతుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా కోటి న్నర మంది చిన్నారులు ముందుగా పుట్టేస్తున్నారు.

నవజాత శిశువుల్లో సమస్యలు..

ప్రి మెచ్యూర్ బేబీల్లో కొన్ని రకాల అనారోగ్య సమ స్యలు తలెత్తుతాయి.ఊపిరితిత్తులు, గుండె, మెదడు, నాడీ, జీర్ణ వ్యవస్థ పూర్తిస్థాయిలో ఎదగవు. వెంటి లేటర్ సహాయంతో చిన్నారికి కృత్రిమ శ్వాస అంది స్తారు. ఐవీ ద్వారా పోషకాలు ఇస్తారు. నాడీ వ్యవ స్థను మెరుగుపర్చేందుకు ఇంక్యుబేటర్స్‌లో పెట్టాల్సి వస్తుంది. ఈ చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కు వగా ఉండడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవు తుంటాయి.

ఈ జాగ్రత్తలు అవసరం..

గర్భిణి పోషకాహారం తీసుకోవాలి. నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఇన్‌ఫెక్షన్ బారిన డపకుండా, ఎనిమియా వంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. ఇకపోతే, ప్రి మెచ్యూర్ డెలివరీలు ఎక్కువగా యూరి నరీ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడే వారి లో అయ్యే అవకాశం ఉంది. ఫ్లూ జ్వరాలు, డయా బెటిస్ సమస్య, గర్భం దాల్చిన తరువాత బరువులు ఎత్తే పనులు చేసే వారిలో రక్తహీనత, గుండె జబ్బు లు, బీపీ, ఇతర అనారోగ్య సమస్యలు, ఉమ్మనీరు లీక్ కావడం వంటి ఇబ్బందుల వల్ల ముందస్తు ప్రస వాలు జరుగుతాయి.

వైద్యుల సూచనలు పాటించాలి

- డాక్టర్ ఐ. వాణి, కేజీహెచ్ సూపరింటెండెంట్



గర్భం దాల్చిన తరువాత నుంచి తగిన పోషకాహారం తీసుకోవడంతో పాటు వైద్యులు సూచించే పరీక్షలు, స్కానింగ్ వంటివి చేయించుకోవాలి. కొన్నిసార్లు ఇబ్బంది ఉంటే ముందుగా గుర్తించి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తాం. ఒక్కోసారి అవసరం లేకపోయినా ప్రిమెచ్యూర్ డెలివరీ అవుతుంది. కొన్నిసార్లు యూ ట్రస్‌లో ఇబ్బందులు వల్ల ప్రిమెచ్యూర్ డెలివరీ చేయించాల్సి వస్తుంది. ప్రిమెచ్యూర్ డెలివరీ పట్ల అవగాహన ఉండడం చాలా అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో అనుకోకుండా అకస్మాత్తుగా ఇబ్బందులు ఎదురై ప్రసవాలు జరుగుతుంటాయి. అటువంటి బేబీలకు మెరుగైన వైద్య సేవలందించాలి. ప్రతి పది మంది గర్భిణీల్లో ఒకరికి ఈ తరహా డెలివరీ అవుతుంటుంది.

డిఫెన్స్ మద్యం పట్టివేత

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 40 డిఫెన్స్ మద్యం బాటిళ్లను ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో సిబ్బంది ఆదివారం పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకా రం.. గోపాపట్నం సింహాచలం రోడ్డులో పవన్ రెసిడెన్సీలో ఒక వ్యక్తి డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నట్టు ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అసిస్టెంట్ కమిష నర్ హెచ్‌వీ మనీష్‌కుమార్‌కు సమాచారం అందింది. ఈమేరకు ఇన్‌స్పెక్టర్ శ్రీని వాస్ సిబ్బందితో కలిసి పి. రామ్మోహనరావు అనే వ్యక్తి ఇంటిపై దాడి చేశారు. 40 బాటిళ్లు లభ్యమయ్యాయి. వాటి విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుం దని అధికారులు తెలిపారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి పెందుర్తి ఎక్సైజ్ పోలీస్‌స్టష న్‌కు అప్పగించారు.

ఆదివాసీల హక్కుల సాధనకు కమిటీ

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలోని ఆదివాసీల హక్కుల సాధనకు జాతీయ సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. బిర్సాముండా జయంతి పురస్కరించుకుని ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) ఆధ్వ ర్యంలో ఆదివాసీల రాజ్యాంగ హక్కుల రక్షణ, వాటి సాధనకు కార్యాచరణ అన్న అంశంపై ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో ఆదివారం సదస్సు నిర్వహిం చారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు చండా లింగయ్యదొర, లకే రాజారావు, ఎన్. జయరాజు, కె. లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధన ఆవశ్యత, వెనుకబాటుతనం, ప్రభుత్వాల పనితీరు, ఆదివాసీల అభివృద్ధిపై చిత్త శుద్ధి వంటి అంశాలపై వివరించారు. అనంతరం జాతీయ సమన్వయ కమిటీ చైర్మన్‌గా లింగయ్యదొర, కన్వీనర్‌గా లకే రాజారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పంచారామాలకు ఆరు ప్రత్యేక సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పంచారామాల క్షేత్ర దర్శ నికి ఆరు ప్రత్యేక సర్వీసులు ఆదివారం సాయంత్రం ద్వారకాబస్‌స్టేషన్ నుంచి బయల్దేరాయి. ఆర్టీసీ విశాఖ రీజియన్ ఉన్నతాధికారులు దగ్గరుండి భక్తులను బస్సెక్కించారు. సాయంత్రం అయిదు గంటలకు బయల్దేరిన బస్సులు సోమవా రం తెల్లవారుజామున అమరావతి చేరుకుంటాయి. అక్కడ అమరేశ్వరుని దర్శ నం తరువాత భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని ఆలయాల కు చేరుకుంటాయి. అక్కడి నుంచి సోమవారం రాత్రికి ద్వారకాబస్‌స్టేషన్‌కు చేరుకుంటాయి. ఈ సర్వీసులను శని, ఆదివారం నడుపుతున్నట్టు ఆర్‌ఎం అప్ప లనాయుడు తెలిపారు.

సీఐఐ సదస్సులతో రాష్ట్రానికి బంగారు భవిత

- ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

సింహాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో విశాఖలో రెండు రోజుల పాటు జరిగిన సీఐఐ సదస్సులతో రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు రానుందని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. గోపాల పట్నం ప్రాంతానికి చెందిన కన్యకాపరమేశ్వరి కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సింహాచలం కర్రి సన్యాసమ్మ మామిడితోటలో ఆదివారం జరిగిన వనసమా రాధనలో ఆయన మాట్లాడారు. సీఐఐ సదస్సుల్లో కోట్లాది రూపాయలు విలువ చేసే ఒప్పందాలు జరిగాయని, వాటి వల్ల లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కళింగ వైశ్య కార్పొరేషన్‌కు ప్రభు త్వం త్వరలో నిధులు కేటాయించనుందని, దాంతో సామాజికవర్గ అభివృద్ధికి డైరెక్టర్లు ప్రణాళికాబద్ధంగా యో చించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, గోపాలపట్నం శాఖ అధ్యక్షుడు గింబలి మధుసూదనరావు,కార్యదర్శి శంకరరావు, కోశాధికారి గుడ్ల మిన్నారావు, తంగుడు గణేశ్, జగదీశ్, ముచ్చేటి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

వేములవలసలో సామూహిక బిల్వార్చన

ఆనందపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేము లవలస గ్రామంలో వేదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివ లింగానికి సామూహిక బిల్వార్చన పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సత్సాంగ గురువు వేదానంద సరస్వతీ మహారాజ్ స్వయంగా పాల్గొని, అభిషేకాలు జరిపారు. 500 మంది భక్తులు సద్గురు వేదానంద మహ రాజ్‌తో కలిసి శివునికి సామూహిక అభిషేకాలు చేశారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

తగరపువలస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని సంగివలస టీచర్ల కాలనీలో నివాసం ఉంటున్న తుర్లపాటి నందిని (21) ఈనెల 14 నుంచి తమ ఏడాదిన్నర కుమా రుడుతో పాటు కనిపించడం లేదని ఆమె భర్త వీరవెల్లి ప్రసన్న కుమార్ భీమిలి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. సీఐ తిరు మలరావు తెలిపిన వివరాలు ప్రకారం.. ప్రసన్నకుమార్ సొంతూరు పల్నాడు జిల్లా ఈపూరు మండలం బొగ్గరం. అతను చిప్పాడలోని దివీస్ కంపెనీలో పని చేస్తుంటారు. ఉద్యోగం రీత్యా రెండేళ్లుగా భార్య, కుమారుడుతో కలిసి టీచర్ల కాలనీలో ఉంటున్నారు. ఈనెల 14న అయన డ్యూటీ నుంచి ఇంటికి రాగానే భార్య, కుమారుడు కనిపించ లేదు. స్థానికంగా వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

సింహగిరిపై అప్పన్న ఏకాదశి తిరువీధి

సింహాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస బహుళ పక్ష ఏకాదశి పురస్కరించుకుని సింహగిరిపై వరాహలక్ష్మీనృసింహ స్వామి తిరువీధి వైభవంగా జరిపారు. ఆదివారం సాయంత్రం ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలప నలు, పండితుల వేద పఠనాల నడుమ మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మార్గంలో భక్తులు ఫల నివేద నలు, కర్పూర నీరాజనాలిచ్చి స్వామివారిని ఆహ్వానించారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యకరం

సింహాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భావితరాలకు ఆరోగ్యక రమైన సమాజం అందించాలంటే ప్రతిఒక్కరూ సేంద్రియ ఉత్పత్తు లను ప్రోత్సహించాలని ఫుడ్ ప్రోసెసింగ్ విభాగం ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి అన్నారు. సింహాచలం దేవస్థానానికి చెందిన నృసిం హవనంలో గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ఆది వారం నిర్వహించిన ప్రకృతి పంటల మేళాలో ఆయన మాట్లాడారు. భూమిని భవిష్యత్తు తరాల కోసం కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అలాగే ప్రకృతి ఆధారిత పంటలు పండించడం ద్వారా వచ్చిన ఉత్పత్తులను ప్రోత్సహించడం మన కర్తవ్యమన్నారు.

సీసీఎస్ నిర్వహణకు టెండర్లు

... 5వ పేజీ తరువాయి

ప్రాజెక్టులను తనిఖీ చేశారు. టౌన్‌కొత్తరోడ్డు వద్ద ఒక హవార్ ప నిచేయడం లేదని, ఓపెన్‌టిప్పర్లతో చెత్తను రాత్రిపూట తరలిస్తున్నట్టు గుర్తించారు. గాజువాకలో హుక్‌లోడర్ ఏడాది కిందట రోడ్డుప్రమాదా నికి గురైతే ఆ వాహనం తిరుగుతున్నట్టు చూపించి డీజిల్ తీసుకుం టున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో రెండు సీసీఎస్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ నుంచి రూ.56 లక్షలు రికవరీ చేసి, బాధ్యత ల నుంచి తొలగించాలని ఆదేశించారు.

నోటీసులతో సరి

అయితే మెకానికల్ అధికారులు కాంట్రాక్టర్‌కు టెర్మినేషన్ నోటీసు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. కమిషనర్ ఆదేశించి రెండునెలలు గడుస్తున్నా ఇంతవరకు రూ.56 లక్షలు రికవరీ చేయలేదు. తాజాగా సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణకు సుమారు రూ.ఏడు కోట్ల అంచనా వ్య యంతో టెండర్లు పిలవడంతో సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసు కుంటే టెండర్లకు అర్హత కోల్పోతాడు. చర్యలపై తాత్సారం చేస్తే టెండ ర్‌లో పాల్గొనే వీలుంటుందని, ఇందుకు అధికారులు పరోక్షంగా సహ కరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టిసారించి నిబంధనలు అతిక్రమించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతున్నారు.

ఏయూలో బ్యాక్‌లాగ్!

... 5వ పేజీ తరువాయి

లేక, గత నోటిఫికేషన్ మేరకు చర్యలు తీసుకున్నారా అనేది అంతుపట్టని ప్రశ్నగా మారింది. అదే సమయంలో మెరిట్ జాబితాను అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపర్చలేదు. సాధారణంగా వర్సిటీలో ఎటువంటి నియామకాలు చేపట్టినా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. కానీ ఈ పోస్టుల విషయంలో ఆ పద్ధతి పాటించకపోవడం అనుమా నాలకు తావిస్తోంది. ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వుల ను కూడా వ్యక్తిగతంగా అందించారు. అంతేకాకుండా నగరంలోని ఒకే ప్రాంతానికి చెందిన నలుగురికి బ్యాక్‌లాగ్ పోస్టుల్లో ఉద్యోగాలు వచ్చి నట్టు చెబుతున్నారు. దీంతో ఉన్నతస్థాయి ఒత్తిళ్ల మేరకు ప్రక్రియను చేపట్టి ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులే ప్రకటించాలి..

నిబంధనలకు అనుగుణంగా నియామక ప్రక్రియను చేపడితే అధి కారులు వెల్లడించాలని పలువురు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై కొందరు కోర్టును ఆశ్రయించేం దుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. ఇప్పటికైనా ఏయూ ఉన్నతాధికారులు నియామక ప్రక్రియపై ప్రకటన విడుదల చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.



భీమిలి సాగర తీరంలో పర్యాటకులు



సందర్శకులతో సందడిగా కనిపిస్తున్న రుషికొండ బీచ్

కిటకిటలాడిన పర్యాటక ప్రాంతాలు

- భీమునిపట్నం, రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లకు పోటెత్తిన సందర్శకులు
- సందడిగా కైలాసగిరి
- ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు



కైలాసగిరికి వెళ్లే కూడలిలో వాహనాల రద్దీ

విశాలాక్షినగర్/సాగర్‌నగర్/భీమునిపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి.కార్తీక మాసం పిక్నిక్‌ల సీజన్ కావడంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు విశాఖలోని పలు ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో తరలివచ్చారు. కైలాసగిరితో పాటు తెన్నేటీపార్కు, జోడుగుళ్లపాలెం తీరం పర్యాటకులతో కిక్కిరిసిపోయాయి. భీమునిప ట్నం, రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లు చిన్నా రులు, యువకులు, పెద్దలతో సందడిగా మారా యి. కైలాసగిరికి రద్దీ పెరగడంతో కొండపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. కొండపై వాహనాలు అధికం కావడంతో దిగువనున్న వాహనాలను కొండపైకి అనుమతించలేదు. కొండపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. భక్తులు యాతన పడ్డారు. ఏటా పిక్నిక్‌ల సీజన్‌లో ఈ పరిస్థితి ఎదురవుతున్నా..వీఎంఆర్‌డీఏ గాని, పోలీసులు గాని చర్యలు తీసుకోవడం లేదు. ట్రాఫిక్ క్లియర్ కాకపోవడంతో చాలా మంది కొండపై నుంచి నడుచుకుంటూ వచ్చారు. విశాలాక్షిన గర్, కైలాసగిరి కూడలి వద్ద వాహనాలు భారీగా నిలిచిపోయాయి. వాహనాలపై వచ్చిన వారిని సాయంత్రం 4 నుంచి కైలాసగిరి కూడలి నుంచి కొండపైకి అనుమతించలేదు. ట్రాఫిక్ భారీగా నిలిచిపోవడంతో కొండపై వాహనాలు కిందకి బ్రేకులు వేసినా జారుతూ ఉండేవి. ఏమాత్రం ఏ వాహనమైనా బ్రేకులు ఫెయిల్ అయితే పర్యాటకుల రద్దీతో చాలా వ రకు ప్రాణ నష్టం సంభవించే పరిస్థితులున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కాగా రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లు సందర్శ కులతో సందడిగా కనిపించాయి.ఇతర రాష్ట్రాల పర్యాటకులు, పిక్నిక్‌లకు వచ్చిన వారితో బీచ్ లలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. కొందరు సముద్ర స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. మరికొందరు సంద్రంపై బోటు షికార్ చేశారు. ఎక్కువ మంది తీర ప్రాంతాల వైపు రావడం తో బీచ్ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్ప డ్డాయి. భీమునిపట్నంలోని పిక్నిక్ స్పాట్‌లన్నీ సందర్శకులతో కిటకిటలాడాయి. సాగర తీరం, బీచ్ పార్క్, కొబ్బరితోట పార్క్, తొట్లకొండ, ఎ ర్రమట్టిదిబ్బలు, మంగమారిపేట బీచ్ పర్యాట కులతో కళగా కనిపించాయి. విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ నుంచి తరలివచ్చారు.

సింహాచలం : సింహాచలం దేవస్థానానికి చెందిన నృశింహవనంలో ఆదివారం పిక్నిక్‌ల సందడి నెలకొంది. నగరంలోని పలు ప్రాంతా లకు చెందిన డ్వాక్రా మహిళలు, పలు కుల సంఘాలకు చెందిన వారు ఇక్కడి తోటల్లో వన సమా రాధనలు నిర్వహించారు.ఆట పాటలతో, లక్కీ డిప్‌లు, క్విజ్ పోటీలు వంటి వాటితో ఉదయం నుంచి సాయంత్రం వరకు హుషా రుగా గడిపారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి శ్రీకాకు ళం ప్రాంతానికి చెందిన బోర జోగినాయుడు, జోత్స్న దంపతులు రూ. లక్ష విరాళంగా సమ ర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపం లో అన్న ప్రసాద విభాగం పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావుకు ఆదివారం వారు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధి కారులు స్వామివారి అంతరాలయ ప్రవేశం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించి, వేదాశీర్వచ నాలు, ప్రసాదాలను అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పద్మనాభం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా సోమవారం ఉద యం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సర ఫరా ఉండదని ఏఈ జగన్మోహన్‌రావు తెలి పారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పద్మనాభం, ఇసకలపాలెం, అర్జకుని పాలెం, కృష్ణాపురం, మద్ది, తునిపాలెం. వీకే పాలెం, బాంధవపురం, విజయరాంపురం, శేరిఖండం, రెడ్డిపల్లి, పొట్నూరు. తునివలస, నరసాపురం, చిన్నాపురం, కొయ్యపేట, విజ యనందపురంనకు విద్యుత్ ఉండదన్నారు.

సిమెంటు బెంచీల వితరణ

తగరపువలస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస, చిట్టివలసలోని పలు దేవాలయాలకు రంగూరి కన్నారావు చారిట బుల్ ట్రస్టు 20 సిమెంటు బెంచీలను విత రణగా అందించింది. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు రంగూరి సీతారామదొర, ఎస్. రామ్ ప్రసాద్, పి.రామకుమార్, మేకల శ్రీను, అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు సీహెచ్‌సీలో సదరం

భీమునిపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీహెచ్‌సీలో సోమవా రం సదరం శిబిరం జరగనున్నట్టు ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫణికుమార్ తెలి పారు.ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రక టన విడుదల చేశారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ

సాగర్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థు లకు క్రమశిక్షణ అవసరమని, అప్పుడే ఉన్నత స్థానాలకు చేరు కుంటారని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన సాగర్‌న గర్ సమీపంలో ఉన్న బీసీ కళాశాల బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసించి మంచి స్థానాలకు ఎదగాలన్నారు. అనంతరం వసతి గృహం పరిసరాలను, స్టోర్ రూమ్, వంట గది, లివింగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఆయనతో పాటు బీసీ వెల్ఫేర్ అధికారులు కె. రాజేశ్వరి, ఆర్. కృష్ణా రావు, సీహెచ్‌వీ రమణ ఉన్నారు.

పీఎంపాలెంలో అయ్యప్ప విగ్రహం ఊరేగింపు

కొమ్మాది, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం సమీపంలో పోతిన పరుశురాం గురు స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి విగ్రహం ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా పోతిన యల్లాజి మాట్లాడుతూ కేరళలోని శబరిమలైలో మండల దీక్ష ప్రారంభం సందర్భంగా స్వామివారి విగ్రహాన్ని ఊరేగించామన్నారు. అనంతరం దీక్ష చేపట్టిన మాలధారులు పేటతుళ్లై ఆడుతూ ఊరేగింపు జరిపారు. అంతకముందు నాలుగు వేల మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాండ్రసి భాస్కర్, బొడ్డేపల్లి చిరంజీవి, పోతిన అప్పన్న, సంతోష్‌పాండే, సీహెచ్ చిన్న తదితరులు పాల్గొన్నారు.



అడవివరం శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

యువత సాహిత్యంపై ఆసక్తి పెంచుకోవాలి

భీమునిపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, యువత సాహిత్యంపై ఆసక్తి పెంచుకోవాలని కళా సాహితీ అధ్య క్షుడు పి. రాజేంద్రప్రసాద్ వర్మ అన్నారు. ఆ దివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో జరి గిన సాహిత్య సభలో ఆయన మాట్లాడారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు సాహిత్యం ద్వారానే అందజేయగల మన్నారు. గ్రంథాలయాధికారి మహేశ్ అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో యెచ్చర్ల ప్రసాదరావు, మాజీ కౌన్సిలరు మైలపల్లి లక్ష్మ ణరావు, సీబీఎం స్కూల్ టీచరు మాదాబ త్తుల మౌనిక పాల్గొన్నారు.

సింహాచలంలో..

సింహాచలం : గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఫ్యాకల్టీ బీబీ రాజేశ్ అన్నారు. అడివివరం శాఖా గ్రంథాల యాధికారి నరసింహం ఆధ్వర్యంలో ఆదివా రం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శననుఆయన ప్రారంభించారు.ప్రదర్శనలో పురాణాలు, పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్, చరిత్ర, నవలలు, కథలు, కామిక్ పుస్తకాలను ఉంచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పార్థసారధి, సంధ్య, సురేశ్ పాల్గొన్నారు.

విశాఖకు విశ్వ ఖ్యాతి

... 5వ పేజీ తరువాయి

గూగుల్ వంటి సంస్థ విశాఖను ఎంచుకోవడంతో నగరం ప్రాముఖ్యత తెలుసుకునేందుకు పలుదేశాల ప్రతినిధులు వచ్చారు. ఇక్కడి అతిథి మర్యాద లు, విశాఖలో సుందర దృశ్యాలు, వనరులు వారిని మంత్రముగ్ధులను చేశాయి. పెట్టుబడుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పలువురు కంపెనీ ప్రతినిధులు పరిశీలించి హామీలు ఇచ్చారు. పెట్టుబడులు కోసమే కాదని, నాలెడ్జిని ఇచ్చి పుచ్చుకోవడం, కొత్త ఆవిష్కరణలపై చర్చలు చేపట్టడంపై విశ్లేషణలకు సదస్సు వేదికగా మారిందని ప్రశంసించారు.

రిలయన్స్ డేటా సెంటర్

విశాఖలో గూగుల్ కంపెనీ ఒక గిగా వాట్ సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రకటన చేయడంతో ప్రపంచంలో అనేక కంపెనీల కన్ను విశాఖ వైపు పడింది. ఈ నేపథ్యంలో రిలయన్స్ సంస్థ ఒక గిగావాట్ సామర్థ్యంతో వి శాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించింది. దీనికితోడు మరో కంపెనీ కూడా డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. పలు ఐటీ కంపెనీలు విశాఖలో తమ శాఖలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి. త్వరలో టీసీఎస్, కాగ్నిజెంట్ కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ఇన్ఫోసిస్ విశాఖ సెంటర్‌ను విస్తరించనున్నది. ఈ నెల 13వ తేదీన ఐటీ మంత్రి లోకేశ్ రుషికొం డ ఐటీ సెజ్‌లో పలు కంపెనీలకు శంకుస్థాపన చేశారు. మరికొన్ని కంపెనీలు నగరంలో తమ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆసక్తి చూపాయి. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు లోకేశ్ శంకుస్థాపనచేశారు.

పర్యాటక రంగానికి ఊతం

జలవిహార్ గ్రూప్ మధురవాడలో టూరిజం పార్కు ఏర్పాటు చేయనుంది. సన్ ఇన్‌స్టిట్యూట్ రూ.150 కోట్లతో బీచ్‌రోడ్డులో హోటల్ నిర్మించనున్నది. భోగా పురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు మరికొన్ని సంస్థలు ఉత్సాహం చూపిస్తున్నాయి. క్రూ యిజ్ వ్యాపార విస్తరణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. విశాఖ నుంచి చెన్నై వ రకు నడుపుతున్న సీ క్రూయిజ్ ఫ్రీక్వెన్సీ పెంచేందుకు నిర్ణయించారు. విశాఖ శివారున హిందూజా గ్రూప్ థర్మల్‌ప్లాంట్‌ను విస్తరించనుంది. నక్కపల్లి సమీ పంలో స్టీల్ సిటీ రానున్నది. పరవాడ, అచ్యుతాపురం ఫార్మాసిటీలలో పలు ఔ షధ కంపెనీలు కొత్త యూనిట్లు ఏర్పాటుచేస్తున్నాయి. భాగస్వామ్య సదస్సు నిర్వహణ ద్వారా విశాఖలో పెట్టుబడులకు అవకాశాలు పెరిగాయని పారిశ్రా మికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.ఇది నగరాభివృద్ధికి దోహదపడడంతో పాటు ఉత్తరాంధ్ర పరిధిలోని యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని చెబుతున్నారు.

ఐ బొమ్మ రవి ఇంట్లో సోదాలు?

... 5వ పేజీ తరువాయి

అతని ఇంట్లో సోదాలు చేశారని నగరంలో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. దీనిపై నగర పోలీస్ ఉన్నతాధికారులతోపాటు, ఆరిలోవ పోలీసులను ఆరా తీయగా తమకు ఎలాంటి సమాచారం లేదని, తనిఖీల ప్రచారాన్ని ఖండించారు. రవి తండ్రి ఒక్కరే ప్రస్తుతం పెదగదిలిలోని ఇంట్లో నివసిస్తున్నట్టు తెలిసింది.

నగరంలో ఐకానిక్ భవనం

... 5వ పేజీ తరువాయి

నెలాఖరు, మిగిలినవి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్/బీపీఎస్ దరఖాస్తుల పరిశీలన వేగ వంతం చేయాలని, తద్వారా సంస్థకు ఆర్థిక పరిపుష్టి కలిగేలా చర్యలు తీసుకో వాలన్నారు. కొత్తవలసలో 120 ఎకరాలు, శొంఠ్యాంలో 80 ఎకరాల్లో థీమ్ బేస్డ్ సిటీస్ నిర్మాణం, ల్యాండ్ పూలింగ్, పీపీపీ ప్రాజెక్టుల స్థితిగతులపై ఆరా తీసి, పలు సూచనలు చేశారు. సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేతన్‌గా ర్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్, జాయింట్ కమిషనర్ రమేష్, కార్యద ర్శి మురళీ కృష్ణ, ప్రధాన ప్రణాళిక అధికారి శిల్ప, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కు మార్, జీవీఎంసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కంబాలకొండను మరింత సుందరంగా తీర్చిదిద్దాలి

» పర్యావరణ. అటవీ, విజ్ఞాన, సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్



జూ పార్కులో గల సింహాల మోటులను పరిశీలిస్తున్న కాంతిలాల్, అటవీ శాఖ అధికారులు

ఆరిలోవ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కంబాల కొండ అభయారణ్యాన్ని మరింత సుందరగా అభివృద్ధి చేయాలని,అందుకు అవసరమైన తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని పర్యావరణ. అటవీ, విజ్ఞాన సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. కార్తీక మాసం నాలుగో ఆదివారం నేపథ్యంలో ఆయన ఆదివారం అటవీ శాఖాదికారులతో కంబాల అభయారణ్యం, జూ పార్కును సందర్శించారు. అక్కడ ఇటీవల నిర్మించిన పలు ప్రాజెక్టులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కంబాలకొండలో వణ్యప్రాణి అభయారణ్యాన్ని సందర్శించి, సందర్శకులకు చక్కని ప్రకృతి అనుభూతి కలిగేలా వసతులు, సదుపాయాలు మెరుగు పరచాలని సూచించారు. నూతనంగా అభివృద్ధి చేసిన క్యాపిటేరియా, ఆంపై థియేటర్, కానోపి వాక్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. జూ లే అవుట్‌లో జాతుల వైవిధ్యాన్ని పరిశీలించారు.

వాచ్ టవర్ వల్ల పార్కులో ప్రత్యేకతను సంతరించుకుందని ప్రశంసించారు. అటవీ సంరక్షకులు బి.మహమ్మద్ ఇవాన్ షైథిన్, జూ క్యూరేటర్ జి.మంగమ్మ జూలో చేపడుతున్న పనులు, నిర్వహిస్తున్న కార్యక్రమాలు, జీవవైవిద్యం, జూలో గల జంతు సంపద గురించి ప్రిన్సిపాల్ సెక్రటరీకి వివరించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కార్యదర్శి మాట్లాడుతూ విశాఖ జూను ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆయన జూ సిబ్బంది, జంతు సంరక్షులతో మాట్లాడారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా? అంటూ ఆరా తీశారు.

కృష్ణా కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మద్దిలపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 190 సీట్ల భర్తీ కోసం స్పాట్ అడిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు తెలిపారు. బీబీఏ లాజిస్టిక్స్-61, బీఎస్సీ ఆర్గానిక్ ఫార్మింగ్- 40, బీఎస్సీ బయో టెక్నాలజీ-17, బీఎస్సీ ఫిషరీస్-21, ఇతర గ్రూపుల్లో అడ్మిషన్లు చేపడుతున్నామన్నారు. 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లల్లో పాల్గొనేందుకు విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఒఏఎండీసీ-2025 ద్వారా ఇప్పటికే ఇతర కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులను అనర్హులని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా చేరిన అభ్యర్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి అర్హులు కాదని గ్రహించాలని విజ్ఞప్తి చేశారు.

సీఐఐ భాగస్వామ్య సదస్సు సూపర్ హిట్

» 'కోడిగుడ్డు మంత్రి' అర్థరహిత విమర్శలు కట్టిపెట్టాలి
» వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్



సిరిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు సూపర్ హిట్ అయిందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రెండురోజుల్లో జరిగిన సదస్సు 613 ఒప్పందాల ద్వారా రాబోయే రోజుల్లో రాష్ట్రానికి రూ.13 లక్షలకోట్లు పెట్టుబడులు రానున్నాయన్నారు. ఫ్యూచర్ రెడీ ఇన్నోవేషన్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. పెద్దఎత్తున ఒప్పందాలు జరగడం ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు రావడం వైసీపీ నేతలకు ఇష్టం లేనట్టుగా కనిపిస్తోందని విమర్శించారు. కోడిగుడ్డు మంత్రిగా పేరొందిన అమర్‌నాథ్ తమ హయాంలో ఎన్ని పెట్టుబడులు తీసుకొచ్చారో బహిరంగ పరచాలన్నారు. హైటెక్ సిటీతో హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని, అదే మాదిరి గూగుల్ రాకతో విశాఖపట్నం ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారబోతోందన్నారు. అభివృద్ధి చూసి, ఓర్వలేని వైసీపీ నాయకులు, బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, వారిని ప్రజలు అస్యహించుకుంటున్నారనే విషయాన్ని గమనిస్తే మేలన్నారు. రాజకీయ పబ్బం కోసం లేనిపోని విమర్శలు మానుకోని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు.

వయోపియా నేత్ర వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

» డాక్టర్ వరలక్ష్మి
» ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్వీ ప్రసాద్ వైద్యశాల డాక్టర్ వరలక్ష్మి, సిబ్బంది, నేత్ర వైద్య విద్యార్థులు

బీచ్ రోడ్డు, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో వయోపియా వేగంగా పెరగడం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో వైద్యురాలు జీఎంఆర్ వరలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు వద్ద వయోపియా కంటి వ్యాధి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల పట్ల పిల్లల్లో సమీప దృష్టి లోపం అంటే దూరంగా ఉన్న వస్తువులు అస్పష్టంగా కనిపిస్తాయని, అలాగే దగ్గర వస్తువులు స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. వయోపియా ఉన్న వారిలో రెటీనా డిటాచ్‌మెంట్ కాంట్రాక్ట్ గ్లోకోమా వంటి ఇతర కంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. వయోపియాకు అద్దాలు, కాంటాక్ట్ లెన్స్‌లు, శస్త్ర చికిత్స వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వయోపియాతో బాధ పడుతున్న వ్యక్తికి దూరపు వస్తువులను చూడడంలో ఇబ్బందిగా ఉంటుందని, దీంతోపాటు ఆ వ్యాధికి అనేక లక్షణాలు ఉన్నాయన్నారు. మారుతున్న జీవనశైలి కారణంగా చిన్నారులు కూడా ఈ సమస్యకు గురవుతున్నారని వెల్లడించారు. అనంతరం ఆర్కే బీచ్ కాళీమాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఆప్తాలజిస్ట్ డాక్టర్ అదితి పారిఖ్, డాక్టర్ మీరేంద్ర సత్యదేవా, వైద్య సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల విజేత విశాఖ



క్రీడాకారులకు ట్రోఫీ అందిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్

లింగపాలెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల విజేతగా విశాఖపట్నం జట్లు నిలిచాయని స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండ లం ధర్మాజీగూడెంలో అండర్-19 రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి.

బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టుపై, బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై విశాఖపట్నం జట్లు విజ యం సాధించాయి. విజేతలకు ఎమెల్యే సొంగా రోషన్‌కుమార్ ట్రోఫీలు, బహుమతులు అందించి అభినందించారు.

సినిమా గైడ్

- **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),
- **జిగ్రీస్** : జగదాంబ
- **శివ, రన్నింగ్ మాన్** : శారదా
- **దే దే ప్యార్ దే** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల్ ఫ్రెండ్** :శ్రీకన్య లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచర పాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 39, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 68, బెండకాయలు 60, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 58, బీరకాయలు 58, ఆనపకాయ 40, కాలీఫ్లవర్ 48, క్యాబేజి 26, క్యారెట్ 60, దొండకాయలు 60, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 72, అల్లం (పాతది) 64, బరబాటి 50, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 46, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

చంద్రబాబు, లోకేశ్‌ల వ్యూహాత్మక పనితీరుకు సీఐఐ సదస్సు నిదర్శనం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వ్యూహాత్మకంగా ఎంత శ్రమిస్తున్నారో నిదర్శనంగా సీఐఐ భాగస్వామ్య సదస్సు నిలిచిందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్‌పై గ్లోబల్ దృష్టిని మళ్లీ కేంద్రీకరించిందని, పెట్టుబడులకు ఏపీని గమ్యస్థానంగా నిలపడంలో చంద్రబాబు తన ప్రావీణ్యాన్ని నిరూపించారని పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను అనుసరిస్తుంటే, ఆంధ్రప్రదేశ్ అందుకు భిన్నంగా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను అనుసరిస్తుందోని తెలిపారు. ప్రతి రంగానికి స్పష్టమైన పాలసీలు రూకపల్పన చేసి, సింగిల్ విండో సిస్టమ్ ద్వారా పెట్టుబడులకు అన్ని అనుమతులు వేగంగా ఇవ్వడం వంటివి పరిశ్రమల ఆకర్షణకు ప్రధాన కారణంగా పేర్కొన్నారు. మొత్తం 613 ఒప్పందాల ద్వారా 13,25,716 కోట్ల పెట్టుబడులు, 16,13,188 ఉద్యోగాలు రావడం రాష్ట్ర అభివృద్ధి పట్ల పెట్టుబడిదారుల నమ్మకానికి ప్రత్యక్ష సాక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధిలో ఏపీ ఇక పరుగులు పెడుతుందన్నారు.

ముగిసిన నెరెడ్కో ప్రాపర్టీ షో



నెరెడ్కో ప్రాపర్టీ షోకు వచ్చిన అతిథులకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రతినిధులు

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో మూడు రోజులుగా జరుగుతున్న నెరెడ్కో ప్రాపర్టీ షో ఆదివారంతో ముగిసింది. చివరి రోజు సందర్శకులు పెద్ద ఎత్తున హాజరై స్థిరాస్తుల కొనుగోలుకు ఆసక్తి చూపారు. సీఐఐ సదస్సుల్లో రికార్డు స్థాయి లో రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరగడం, వాటిలో విశాఖ పరిసరాలకు ప్రాధాన్యం కల్పించడంతో కొనుగోలుదారుల్లో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది.

ఈ సందర్భంగా నెరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు చక్రధర్ మాట్లాడుతూ నగరంలో జరిగిన సీఐఐ సదస్సుల్లో రూ. 13 లక్షల కోట్ల ఒప్పందాలు జరగడంతో విశాఖ రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. త్వరలోనే అంతర్జాతీయ నగరంగా ఎదగడం ఖాయమని తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ప్రశాంత నగరమని, దేశ విదేశాల్లో ఉంటూ స్థిరాస్తులు కొనుగోలు చేసినా, ఆస్తుల భద్రతకు భరోసా ఉంటుందన్నారు. అన్ని అనుమతులతో నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నెరెడ్కో నమ్మకమైన సంస్థ అని పేర్కొన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టితో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందన్నారు. అచ్యుతాపురం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో నెరెడ్కో ఉత్తరాంధ్ర సలహా కమిటీ చైర్మన్ చోడే పట్టాభిరామ్, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు రమేశ్‌బాబు,విశాఖ నగర అధ్యక్షుడు రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు వెంకన్న చౌదరి, పాపారావు, సుబ్బారావు, మిథున్, ధర్మా, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ మెచ్యూర్డ్ పిల్లల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

» నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
» బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీలు



అవగాహన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, తదితరులు



ర్యాలీ నిర్వహిస్తున్న రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, ఏవీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్లు, విద్యార్థులు

బీచ్ రోడ్డు, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : నేడు తల్లికి నెలలు నిండకుండానే పిల్లలు పుడుతున్న కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, ఇలా జన్మించిన పిల్లల్లో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమవుతున్నాయని, ఈ సవాల్‌ను అధిగమించేందుకు ఆరోగ్యపరంగా పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ ప్రీ మెచ్యూరిటీ దినం సందర్భంగా మెడీకవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నెలలు నిండకుండా పుట్టిన శిశువుల విషయంలో అదనపు సంరక్షణ అవసరమని, వారి ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్త వహించాల్సి ఉంటుందన్నారు. శిశువుల పట్ల ఇన్ఫెక్షన్లు, అలర్జీల నుంచి కాపాడడం చాలా అవసరమని ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలకు ఎప్పటికప్పుడూ ఆరోగ్య పరీక్షలు చేయిస్తుండడం చేయించాలని సూచించారు.

డాక్టర్ సాయి సునీల్‌కిశోర్ మాట్లాడుతూ గర్భం దాల్చిన 37 వారాలకు ముందుగానే శిశువు జన్మించినట్టతే ఆ శిశువును ప్రీమెచ్యూరిటీ శిశువుగా పరిగణిస్తారని చెప్పారు. ఈ విషయంలో అందరికీ అవగాహన కల్పించేందుకే అంతర్జాతీయ ప్రీ మెచ్యూరిటీ దినాన్ని జరుపుకుంటున్నట్టు తెలిపారు.

అనంతరం ఆర్కే బీచ్‌లోని కాళీమాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యాధికారులు, పలువురు వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెయిన్ బో చిల్డ్రన్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో..

గర్భం దాల్చిన 37 వారాల ముందుగానే శిశువు జన్మించినట్టయితే వైద్యులు ఆ శిశువును ప్రీ మెచ్యూరిటీగా పరిగణిస్తారని రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జోనల్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ ప్రీ మెచ్యూరిటీ దినోత్సవం సందర్భంగా బీచ్ రోడ్డు వద్ద వాక్‌దాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలు నిండకుండా పుట్టే పిల్లలు పెరిగే కొద్దీ ఎదుర్కొనే ఆరోగ్య సవాళ్ల గురించి వివరించారు. ఇలా నెలలు నిండకుండా పుడుతున్న శిశువులు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా మస్తిష్క, పక్షపాతం, పెరుగుదలలో ఆలస్యం, వినికిడి సమస్యలు, దృష్టి సమస్యలు ఎక్కువగా ఉంటాయని వెల్లడించారు. బిడ్డకు తల్లి స్పర్శ చాలా అవసరమని, నెలలు నిండని శిశువుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంటుందన్నారు. 2025 ఆరోగ్య సర్వే ప్రకారం భారతదేశంలో నవజాతి శిశువుల మరణాలకు నెలలు నిండ కుండా జన్మించడం కూడా ఒక ప్రధాన కారణమన్నారు. దాదాపు 13 శాతం మంది పిల్లలు ముందస్తు శిశువులుగా జన్మిస్తున్నారని, 17 శాతం మంది తక్కువ బరువుతో జన్మిస్తున్నారని సర్వేలో వెల్లడైందన్నారు. ఆస్పత్రి వైద్యులు కన్సల్టెంట్ నియోనాటాలాజిస్ట్ డాక్టర్ బి.వినయ్ మాట్లాడుతూ ముందస్తుగా జన్మించే శిశువులు ఎదుర్కొనే ఆరోగ్య ఇబ్బందులు వాటిని నివారించే అంశాలపై అవగాహన చాలా అవసరమన్నారు.

అనంతరం ఆర్కే బీచ్ నుంచి కాళికామాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెయిన్‌బో ఆస్పత్రి డాక్టర్ మండుళా ఫణిప్రియా, గైనకాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ రాగసుధ, డాక్టర్ నిహారిక, డాక్టర్ ఎంవీఆర్ శైలజ, మెడికల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటుపై మాట తప్పిన కూటమి నేతలు

» వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

మద్దిలపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు మాట తప్పారని వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కెకె రాజు విమర్శించారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ జరగకుండా చూస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తన కుమారుడు లోకేశ్ రాజకీయ భవిష్యత్తు కోసమే ప్లాంటు ప్రైవేటీ కరణకు చంద్రబాబు సహకరిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు కన్ను స్టీల్‌ప్లాంటు భూములపై పడిందని ఆరోపించారు. ఇప్పటికే ఉత్తరాంధ్రలోని భూములను పప్పుబెల్లంలా పంచి పెట్టారన్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా జగన్ నాయకత్వంలో స్టీల్‌ప్లాంటును పరిరక్షించుకుంటామన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నేత మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సామూహిక వ్రతాలు

ఆరిలోవ నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయిబాబా శతవార్షిక జన్మ దినోత్స దినోత్సవాల్లో భాగంగా ఆరిలోవ బీటీఆర్ నగర్ ఓంకార మందిరం ఆరిలోవ భజన మండలి సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్యసాయి వ్రతాలను నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య తొలుత వినాయక పూజను చేశారు. సాయిబాబాకు గులాబీలతో పూజలు నిర్వహించారు.

ముందే ప్రసవ వేదన

కొన్నాళ్లుగా పెరుగుతున్న ముందస్తు ప్రసవాలు



- ప్రి మెచ్యూర్ బేబీల ఆరోగ్యం పట్ల అప్రమత్తం అవసరం
- అవగాహన లేకపోతే మరణాలకు అవకాశం
- నేడు వరల్డ్ ప్రిమెచ్యూరిటీ డే

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : **ఇటీవల కాలంలో ముందస్తు ప్రసవాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గర్భం దాల్చినప్పటి నుంచి 40 వారాలు దాటిన తరువాత మాత్రమే ప్రసవించాలి. కానీ అనేక కారణాల వల్ల కొందరు గర్భిణుల్లో ముందస్తు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇలా పుట్టే చిన్నారులను ప్రి మెచ్యూర్ బేబీ అంటారు. ఈ తరహా జన్మించే చిన్నారుల్లో అనేక అనారోగ్య సమస్యలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాటిపై అవగాహన కలిగించే ఉద్దేశంతోనే ఏటా నవంబరు 17న వరల్డ్ ప్రిమెచ్యూరిటీ డే నిర్వహిస్తున్నారు.**

గర్భం దాల్చిన తరువాత 38 నుంచి 40 వారాల మధ్య ప్రసవం జరుగుతుంది. అయితే కొన్ని కారణాల వల్ల 37 వారాల కంటే ముందుగా ప్రసవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలా పుట్టే శిశువుల్లో అనేక అనారోగ్య సమస్యలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా 27 వారాల నుంచి 25 వారాల్లోపు జన్మించే వారిలో తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉండే అవకాశం ఉంది. వీరికి మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా కోలుకునేలా చేస్తారు. కొన్నిసార్లు గర్భిణుల్లో బీపీ, షుగర్ పెరిగినా, బిడ్డ ఎదుగుదల తక్కువగా ఉన్నా, ఉమ్మనీరు ఆశించిన స్థాయిలో లేకపోయినా ముందస్తు ప్రసవాలు జరుగుతుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా కోటిన్నర మంది చిన్నారులు ముందుగా పుట్టేస్తున్నారు.

నవజాత శిశువుల్లో సమస్యలు..

ప్రి మెచ్యూర్ బేబీల్లో కొన్ని రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఊపిరితిత్తులు, గుండె, మెదడు, నాడీ, జీర్ణ వ్యవస్థ పూర్తిస్థాయిలో ఎదగవు. వెంటిలేటర్ సహాయంతో చిన్నారికి కృత్రిమ శ్వాస అందిస్తారు. ఐవీ ద్వారా పోషకాలు ఇస్తారు. నాడీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు ఇంక్యుబేటర్స్‌లో పెట్టాల్సి వస్తుంది. ఈ చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతుంటాయి.

ఈ జాగ్రత్తలు అవసరం..

గర్భిణి పోషకాహారం తీసుకోవాలి. నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా, ఎనీమియా వంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. ఇకపోతే యూరినరీ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడే వారిలో ప్రిమెచ్యూర్ డెలివరీలు ఎక్కువగా అయ్యే అవకాశం ఉంది. ఫ్లూ జ్వరాలు, డయాబెటిస్ సమస్య, గర్భం దాల్చిన తరువాత బరువులు ఎత్తే పనులు చేసే వారిలో రక్తహీనత, గుండె జబ్బులు, బీపీ, ఇతర అనారోగ్య సమస్యలు, ఉమ్మనీరు లీక్ కావడం వంటి ఇబ్బందుల వల్ల ముందస్తు ప్రసవాలు జరుగుతాయి.



వైద్యుల సూచనలు పాటించాలి

- డాక్టర్ ఐ. వాణి, కేజీహెచ్ సూపరింటెండెంట్



గర్భం దాల్చిన తరువాత నుంచి తగిన పోషకాహారం తీసుకోవడంతో పాటు వైద్యులు సూచించే పరీక్షలు, స్కానింగ్ వంటివి చేయించుకోవాలి. కొన్నిసార్లు ఇబ్బంది ఉంటే ముందుగా గుర్తించి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తాం. ఒక్కోసారి అవసరం లేకపోయినా ప్రిమెచ్యూర్ డెలివరీ అవుతుంది. కొన్నిసార్లు యూట్రస్‌లో ఇబ్బందుల వల్ల ప్రిమెచ్యూర్ డెలివరీ చేయించాల్సి వస్తుంది. ప్రిమెచ్యూర్ డెలివరీ పట్ల అవగాహన ఉండడం చాలా అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో అకస్మాత్తుగా ఇబ్బందులు ఎదురై ప్రసవాలు జరుగుతుంటాయి. అటువంటి బిడ్డలకు మెరుగైన వైద్య సేవలందించాలి. ప్రతి పది మంది గర్భిణుల్లో ఒకరికి ఈ తరహా డెలివరీ అవుతుంటుంది.

ఈత పోటీల్లో ఓవరాల్ చాంప్ విశాఖ

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర, బాలికల ఈత పోటీల్లో విశాఖ ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. విశాఖ స్విమ్మర్లు నాలుగు స్వర్ణ, ఏడు రజత, తొమ్మిది కాంస్య పతకాలతో 90 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో విశాఖకు చెందిన వేదాంత్ గౌతమ్ పంచల్ రెండు స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో వ్యక్తిగత చాంపియన్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. జిల్లా సంఘం ప్రతినిధులు మోహన వెంకటరామ్, సంతోష్‌కుమార్ శెట్టి, జి.శ్రీరామమూర్తి, ఎన్.రఘునాధరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రౌడీ షీటర్లకు సీఐల హెచ్చరిక

మహారాణిపేట/సీతంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏ చిన్న నేరానికి పాల్పడినా పీడీ చట్టం ప్రయోగించి అరెస్టు చేస్తామని మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్, ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ వెంకటరమణలు రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం రౌడీ షీటర్లను మహారాణిపేట, ద్వారకా స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మీపై పూర్తి నిఘా ఉందని, ఎట్టిపరిస్థితుల్లోనూ హద్దుమీరి వ్యవహరించవద్దన్నారు. మద్యం, మాదకద్రవ్యాలు సేవించి గలాటా చేస్తే చర్య తీసుకుంటామన్నారు. ఎటువంటి నేర సంఘటనల్లో పాల్గొన్నా, పరోక్షంగా సహకరించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టంచేశారు. అందరి పట్ల మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. సామూహికంగా, వ్యక్తిగతంగా మాట్లాడిన సీఐలు ఈ హెచ్చరికలు చేశారు. పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి

కంచరపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. గవరకంచరపాలెం వెలమవీధి సమీపంలో రైల్వే ట్రాక్‌ను ఆనుకుని ఉన్న చెట్ల పొదలో ఓ వ్యక్తి చెట్టుకు వేలాడుతూ ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి ఒంటిపై నల్లరంగు ప్యాంటు, ఆరెంజ్ రంగు చొక్కా ఉన్నాయి. నల్లని చెప్పులు ధరించి ఉన్నాడని తెలియజేశారు. 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందని, పది రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుని బంధువులు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. సీఐ కె.రవికుమార్ నేతృత్వంలో ఎస్.ఐ. రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి జారిపడి తాపీ మేస్త్రీ మృతి



మాధవధార, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధి కాకానినగర్‌లో మూడంతస్థుల భవనం పైనుంచి జారిపడి తాపీమేస్త్రీ మృతి చెందాడు. స్థానికులు, ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఏడీ కొత్తరోడ్డు విమాన్‌నగర్ రజకుల వీధిలో చిలకలపల్లి శ్రీను భార్య విజయలక్ష్మి, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం మీసేవ ఎదురుగా ఉన్న మూడంతస్థుల భవనంలో పని కోసం వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వెళ్లాక, మళ్లీ పనిచేసే భవనం వద్దకు కూలి డబ్బుల కోసం వచ్చాడు. బిల్డింగ్ ముందు ఎలివేషన్ కోసం కట్టిన పరంజీ మీద నుంచి రేకులు అందిస్తుండగా, ప్రమాదవశాత్తూ కాలు జారి మూడో అంతస్తు నుంచి పడిపోయాడు. చిలకలపల్లి శ్రీను తల, ఎడమ కాలు, కుడి చేతికి తీవ్ర గాయాలవడంతో చికిత్స నిమిత్తం 108లో కేజీహెచ్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ప్రకటించారు. శ్రీనుకు ఇద్దరు కుమార్తెలు కాగా, ఒకరికి వివాహమైంది. మృతుని భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ సీఐ వి.శంకర నారాయణ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు

- ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

అక్కయ్యపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేడు 80 నుంచి 85 శాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదం వల్లే జరుగుతున్నాయని ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. రైల్వే న్యూకాలనీలోని బ్రహ్మకుమారీల ఈశ్వరి విశ్వవిద్యాలయంలో ఆదివారం సాయంత్రం 'యునైటెడ్ నేషన్స్ వరల్డ్ డే ఆఫ్ రిమెంబర్స్ ఫర్ రోడ్డు ట్రాఫిక్ విక్టిమ్స్' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ యశ్వంత్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, అవయవాలు కోల్పోవడం లేదా గాయం తగలడాన్ని చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. కానీ హెల్మెట్ ధరించకపోవడం వల్ల చాలా ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. జిల్లా రవాణా శాఖ కమిషనర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాస్, బ్రహ్మకుమారిస్ రైల్వేన్యూకాలనీ బ్రాంచ్ ఇన్‌చార్జ్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి శతజయంతి వేడుకలు



నిరుపేదలకు నిత్యావసరాల్ని అందిస్తున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, భజనమండలి సభ్యులు

మురళీనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మురళీనగర్ సత్యసాయి భజనమండలిలో జరిగిన ప్రత్యేక ఆరాధనలో ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వామికి విశేష పూజాహారతి అందించారు. అనంతరం సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు నిత్యావసర సరుకుల్ని ఎమ్మెల్యే అందించారు. వందలాది మంది పాల్గొన్నారు. మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రవిత్రోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయ వర్గాలు ఆయనకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషుస్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, వేదాశీర్వచనం అందించారు.

అక్కినేని జీవితం స్ఫూర్తిదాయకం



అక్కినేని చిత్ర గీతాలు ఆలపిస్తున్న భూపతిరావు బృందం

డాబాగార్డెన్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత తెలుగు సినీనటుడు డా.అక్కినేని నాగేశ్వరరావు జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని డాక్టర్ రమ్య, డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం ఆడిటోరియంలో అమ్మ,నాన్న, అన్న సంస్థ సీనియర్ గాయకులు భూపతిరావు ఆధ్వర్యంలో 'తెలుగు అక్షరమాల'లో అక్కినేని చిత్ర గీతాల మాల సినీ సంగీత విభావరి ప్లస్ 60 కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌరవ అతిథులుగా ఎస్.ఫణిస్వామి, వర్రె నాంచారయ్య, ఫణిభూషణ్, ఎం.కృష్ణంరాజు, పట్నం వెంకటేష్, భయ్యా శ్రీనివాస్, ఎంవీఆర్ నాగేశ్వరరావులతో కలిసి అక్కినేని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయనీగాయకులు ఉమాదేవి, భూపతి, రాజేశ్వరి, సత్యవతి, శైలజ నిర్విరామంగా 60 గీతాలు ఆలపించి వీక్షకులను అలరించారు.

కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రాభివృద్ధి: లంకా దినకర్

అక్కయ్యపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి జరుగుతోందని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ అన్నారు. దొండపర్తిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చార్టర్డ్ ఇంజనీర్లు, వాల్యూయర్స్‌లాంటి ఆస్తులు, వనరుల మూల్యాంకన వృత్తి నైపుణ్యం ఉన్నవారు కలిసి పని చేస్తే అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. ప్రధాని మోదీ సంకల్పం వికసిత్ భారత్-2047లో ఆంధ్రప్రదేశ్ భాగమయ్యేందుకు ఆలోచనలు చేయాలన్నారు. విశాఖ బ్రాంచ్ చైర్మన్ కేవీ రామ్మోహనరావు, సెక్రటరీ చల్లా సురేష్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు సీనియర్ రీజనల్ మేనేజర్ రవికుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సంతకాల సేకరణ

అక్కయ్యపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గ్రేటర్ 45వ వార్డు తాటిచెట్లపాలెం నాలుగు లేన్ల రహదారి బస్టాప్ వద్ద వైసీపీ ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థులు, స్థానికుల నుంచి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, వార్డు అధ్యక్షుడు పైడి రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మకరవిళక్కు మహోత్సవం



ఊరేగింపులో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

అక్కయ్యపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్పస్వామి ఆలయం తలుపులు (మకరవిళక్కు మహోత్సవం) ఆదివారం సాయంత్రం తెరుచుకున్నాయి. ఈ మేరకు అల్లిపురం నేరెళ్ళ కోనేరు ప్రాంతంలోని ధర్మశాస్త్ర పీఠం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి వారిని పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య తిరువీధుల్లో ఊరేగించారు. అర్చకుడు కొడుకుల కామేశ్వరరావు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సిరి వినాయక ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు కె.రమేష్ (గురుస్వామి) ఆధ్వర్యంలో మండల దీక్షాధారులు, మహిళలు కలశాలతో పసుపు నీళ్లను తీసుకుని పల్లకి ఊరేగింపులో పాల్గొన్నారు. అయ్యప్ప నామస్మరణ, భక్తి గీతాలు ఆలపించడంతో తిరువీధులు మార్మోగాయి. వినాయక బృందం చేసిన కోలాట నృత్యాలు విశేషంగా ఆకర్షించాయి. నేరెళ్ళ కోనేరు సమీపంలో ఉన్న సిరి వినాయక ఆలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపు అల్లిపురం తిరువీధుల్లో తిరిగి మళ్లీ సిరివినాయక ఆలయానికి చేరుకుంది. అక్కడ వినాయకునికి, అయ్యప్పస్వామికి భక్తిశ్రద్ధలతో జలాభిషేకం చేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మర్రిపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్‌లో వెలసిన జ్ఞాన ప్రసూనాంబిక సహిత పంచముఖేశ్వరాలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకులు పొలమరశెట్టి శ్రీనివాసరావు, పొలమరశెట్టి నర్సకుమారి, కార్తీక్ కుట్టా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీస్తురక్షకుని యాత్ర మహోత్సవం



క్రీస్తు స్వరూపాన్ని ఊరేగిస్తున్న విశ్వాసులు

జ్ఞానాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం రక్షణ గిరి పుణ్యక్షేత్రంలో ఆదివారం క్రీస్తు రక్షకుని యాత్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా నుంచి ఆర్‌సీఎం క్రైస్తవ విశ్వాసులు పాల్గొని ప్రార్థనలు చేశారు. ముఖ్యఅతిథిగా విశాఖ కేథలిక్ అగ్రపీఠాధిపతి ఆర్చ్ బిషప్ మోస్ట్ రెవరెండ్ ఉడుముల బాలశౌరి హాజరయ్యారు. బైబిల్ ఉజ్జీవ సభ భక్తిప్రపత్తులతో జరిగింది. సాయంత్రం ఏసుక్రీస్తు ప్రభువు స్వరూపంతో ప్రజలు జ్ఞానాపురం వీధుల్లో పుర ప్రదక్షిణ చేసి రక్షణ గిరి పైకి చేరారు. ఈ వేడుకలకు జ్ఞానాపురం విచారణకర్తలు ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, సహాయ విచారణకర్తలు ఫాదర్స్ ప్రేమ్ కుమార్, పిరికి థామస్, ముసులు రాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'సంగీత సాహిత్యాలు సిరివెన్నెలకు రెండుకళ్లు'



సమావేశంలో మాట్లాడుతున్న చెరుకువాడ సత్యనారాయణ, చిత్రంలో ఇతర ప్రముఖులు

సీతంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంగీత, సాహిత్యాలలో అందెవేసిన చేయి సిరివెన్నెల సీతారామశాస్త్రిదని, సంగీతం ఆయన ఊపిరి, సాహిత్యం అతని బలమని సిరివెన్నెల సాహితీ మిత్రుడు చెరుకువాడ సత్యనారాయణ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సిరివెన్నెల సీతారామశాస్త్రి, సినీయేతర సాహిత్యంపై ప్రసంగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన చెరుకువాడ సత్యనారాయణ మాట్లాడుతూ 16వ ఏటనే వ్యాసాలు, గేయాలు రాసిన సిరివెన్నెల సాహితీ చైతన్య మూర్తి అని అభివర్ణించారు. పాడడం అతనికి చాలా ఇష్టమన్నారు. ఈ సభకు విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షత వహించారు. డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఒక గ్రంథాలయం ఉండాలనే నినాదం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ప్రయాగ రామకృష్ణ, సత్యానంద్, సాహితీ మిత్రులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సీతాశ్రీనివాస్ కథా విన్యాసం



స్టోరీ అండ్ ఆర్ట్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

సీతంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా భారతీయ విద్యా భవన్, విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కథా విన్యాసం 'స్టోరీ అండ్ ఆర్ట్ ఫెస్టివల్' విద్యార్థులను ఆకట్టుకుంది. ప్రసిద్ధ కథాకారిణి, వాయిస్ ఆర్టిస్ట్, వాయిస్ రికార్డర్ ఎం.సీతాశ్రీనివాస్ విద్యార్థులకు కథా విన్యాసాలను వినిపించడంతో పాటు స్టోరీ అండ్ ఆర్ట్ ఫెస్టివల్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కథా రచన, చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను స్టీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎ.చౌదరి, పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డి.ఎస్. వర్మ, ఉపాధ్యక్షులు టీఎస్ఆర్ ప్రసాద్‌లు అందచేశారు.

'పొరపాట్లు సవరించండి'

డాబాగార్డెన్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ 2026 వరకు పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో తప్పిదాలు సవరించాలని రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం స్టేట్ కన్వీనర్ నరవ ప్రకాశరావు కోరారు. తరగతులు ఆదివారం, పండుగ రోజుల్లోనూ నిర్వహించాలని సూచించారని అన్నారు. ఇటువంటి ఉత్తర్వులు పని ఒత్తిడిని పెంచుకోవడంగా పరిగణిస్తారని తెలిపారు. సెలవులు పొందడం విద్యార్థుల హక్కు అన్నారు. ఈ ఉత్తర్వులు ఉద్యోగులు, బాలల హక్కులను హరించడమేనన్నారు. ఒత్తిడి లేని చదువులు కావాలని, తక్షణమే ప్రభుత్వం ఈ పొరపాటును సవరించి ప్రణాళికను విడుదల చేయాలని కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ వి.విజయరామరాజుకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మండల పూజ

సీతంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శబరిగిరి హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి దేవాలయం ప్రారంభం సందర్భంగా గ్రేటర్ విశాఖ 25వ వార్డులో గురు స్వామి గిరి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మండల పూజ, అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఏపీ సీసీ స్పోర్ట్స్ చైర్మన్ జీవీవీఎస్ కమలాకర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి పూజలు చేసి అన్నదాన వడ్డన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు నారా నాగేశ్వరరావు, గిరి, వేణు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో బ్యాక్‌లాగ్!

... 5వ పేజీ తరువాయి

లేక, గత నోటిఫికేషన్ మేరకు చర్యలు తీసుకున్నారా అనేది అంతుపట్టని ప్రశ్నగా మారింది. అదే సమయంలో మెరిట్ జాబితాను అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపర్చలేదు. సాధారణంగా వర్సిటీలో ఎటువంటి నియామకాలు చేపట్టినా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. కానీ ఈ పోస్టుల విషయంలో ఆ పద్ధతి పాటించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వుల ను కూడా వ్యక్తిగతంగా అందించారు. అంతేకాకుండా నగరంలోని ఒకే ప్రాంతానికి చెందిన నలుగురికి బ్యాక్‌లాగ్ పోస్టుల్లో ఉద్యోగాలు వచ్చినట్టు చెబుతున్నారు. దీంతో ఉన్నతస్థాయి ఒత్తిళ్ల మేరకు ప్రక్రియను చేపట్టి ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులే ప్రకటించాలి..

నిబంధనలకు అనుగుణంగా నియామక ప్రక్రియను చేపడితే అధికారులు వెల్లడించాలని పలువురు కోరుతు న్నారు. ఈ వ్యవహారంపై కొందరు కోర్టును ఆశ్రయించేం దుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. ఇప్పటికైనా ఏయూ ఉన్నతాధికారులు నియామక ప్రక్రియపై ప్రకటన విడుదల చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఐ బొమ్మ రవి ఇంట్లో సోదాలు?

... 5వ పేజీ తరువాయి

అతని ఇంట్లో సోదాలు చేశారని నగరంలో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. దీనిపై విశాఖ నగర పోలీస్ ఉన్నతాధికారులతోపాటు, ఆరిలోవ పోలీసులను ఆరా తీయగా తమకు ఎలాంటి సమాచారం లేదని, తనిఖీల ప్రచారాన్ని ఖండించారు. రవి తండ్రి ఒక్కరే ప్రస్తుతం పెదగదిలిలోని ఇంట్లో నివసిస్తున్నట్టు తెలిసింది.

సీసీఎస్ నిర్వహణకు టెండర్లు

... 5వ పేజీ తరువాయి

ప్రాజెక్టులను తనిఖీ చేశారు. టౌన్‌కొత్తరోడ్డు వద్ద ఒక హూపర్ పనిచేయడం లేదని, ఓపెన్‌టిప్పర్లతో చెత్తను రాత్రిపూట తరలిస్తున్నట్టు గుర్తించారు. గాజువాకలో హుక్‌లోడర్ ఏడాది కిందట రోడ్డుప్రమాదానికి గురైతే ఆ వాహనం తిరుగుతున్నట్టు చూపించి డీజిల్ తీసుకుంటున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో రెండు సీసీఎస్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ నుంచి రూ.56 లక్షలు రికవరీ చేసి, బాధ్యతల నుంచి తొలగించాలని ఆదేశించారు.

నోటీసులతో సరి

అయితే మెకానికల్ అధికారులు కాంట్రాక్టర్‌కు టెర్మినేషన్ నోటీసు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. కమిషనర్ ఆదేశించి రెండునెలలు గడుస్తున్నా ఇంతవరకు రూ.56 లక్షలు రికవరీ చేయలేదు. తాజాగా సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణకు సుమారు రూ.ఏడు కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలవడంతో సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటే టెండర్లకు అర్హత కోల్పోతాడు. చర్యలపై తాత్సారం చేస్తే టెండర్‌లో పాల్గొనే వీలుంటుందని, ఇందుకు అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టిసారించి నిబంధనలు అతిక్రమించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతున్నారు.

నగరంలో ఐకానిక్ భవనం

... 5వ పేజీ తరువాయి

నెలాఖరు, మిగిలినవి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్/బీపీఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని, తద్వారా సంస్థకు ఆర్థిక పరిపుష్టి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తవలసలో 120 ఎకరాలు, శొంఠ్యాంలో 80 ఎకరాల్లో థీమ్ బేస్డ్ సిటీస్ నిర్మాణం, ల్యాండ్ పూలింగ్, పీపీపీ ప్రాజెక్టుల స్థితిగతులపై ఆరా తీసి, పలు సూచనలు చేశారు. సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్, జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీ కృష్ణ, ప్రధాన ప్రణాళిక అధికారి శిల్ప, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, జీవీఎంసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విశాఖకు విశ్వ ఖ్యాతి

... 5వ పేజీ తరువాయి

గూగుల్ వంటి సంస్థ విశాఖను ఎంచుకోవడంతో నగరం ప్రాముఖ్యత తెలుసుకునేందుకు పలుదేశాల ప్రతినిధులు వచ్చారు. ఇక్కడి అతిథి మర్యాదలు, విశాఖలో సుందర దృశ్యాలు, వనరులు వారిని మంత్రముగ్ధులను చేశాయి. పెట్టుబడుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పలువురు కంపెనీ ప్రతినిధులు పరిశీలించి హామీలు ఇచ్చారు. పెట్టుబడులు కోసమే కాదని, నాలెడ్జిని ఇచ్చి పుచ్చుకోవడం, కొత్త ఆవిష్కరణలపై చర్చలు చేపట్టడంపై విశ్లేషణలకు సదస్సు వేదికగా మారిందని ప్రశంసించారు.

రిలయన్స్ డేటా సెంటర్

విశాఖలో గూగుల్ కంపెనీ ఒక గిగా వాట్ సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రకటన చేయడంతో ప్రపంచంలో అనేక కంపెనీల కన్ను విశాఖ వైపు పడింది. ఈ నేపథ్యంలో రిలయన్స్ సంస్థ ఒక గిగావాట్ సామర్థ్యంతో విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించింది. దీనికితోడు మరో కంపెనీ కూడా డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. పలు ఐటీ కంపెనీలు విశాఖలో తమ శాఖలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి. త్వరలో టీసీఎస్, కాగ్నిజెంట్ కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ఇన్ఫోసిస్ విశాఖ సెంటర్‌ను విస్తరించనున్నది. ఈ నెల 13వ తేదీన ఐటీ మంత్రి లోకేశ్ రుషికొండ ఐటీ సెజ్‌లో పలు కంపెనీలకు శంకుస్థాపన చేశారు. మరికొన్ని కంపెనీలు నగరంలో తమ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆసక్తి చూపాయి. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు లోకేశ్ శంకుస్థాపనచేశారు.

పర్యాటక రంగానికి ఊతం

జలవిహార్ గ్రూప్ మధురవాడలో టూరిజం పార్కు ఏర్పాటు చేయనుంది. సన్ ఇన్‌స్టిట్యూట్ రూ.150 కోట్లతో బీచ్‌రోడ్డులో హోటల్ నిర్మించనున్నది. భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు మరికొన్ని సంస్థలు ఉత్సాహం చూపిస్తున్నాయి. క్రూయిజ్ వ్యాపార విస్తరణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. విశాఖ నుంచి చెన్నై వరకు నడుపుతున్న సీ క్రూయిజ్ ఫ్రీక్వెన్సీ పెంచేందుకు నిర్ణయించారు. విశాఖ శివారున హిందూజా గ్రూప్ థర్మల్‌ప్లాంట్‌ను విస్తరించనుంది. నక్కపల్లి సమీపంలో స్టీల్ సిటీ రానున్నది. పరవాడ, అచ్యుతాపురం ఫార్మాసిటీలలో పలు ఔషధ కంపెనీలు కొత్త యూనిట్లు ఏర్పాటుచేస్తున్నాయి. భాగస్వామ్య సదస్సు నిర్వహణ ద్వారా విశాఖలో పెట్టుబడులకు అవకాశాలు పెరిగాయని పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.ఇది నగరాభివృద్ధికి దోహదపడడంతో పాటు ఉత్తరాంధ్ర పరిధిలోని యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని చెబుతున్నారు.

కంబాలకొండను మరింత సుందరంగా తీర్చిదిద్దాలి

» పర్యావరణ. అటవీ, విజ్ఞాన, సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్

ఆరిలోవ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కంబాల కొండ అభయారణ్యాన్ని మరింత సుందరగా అభివృద్ధి చేయాలని,అందుకు అవసరమైన తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని పర్యావరణ. అటవీ, విజ్ఞాన సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. కార్తీక మాసం నాలుగో ఆదివారం నేపథ్యంలో ఆయన ఆదివారం అటవీ శాఖాధికారులతో కంబాల అభయారణ్యం, జూ పార్కును సందర్శించారు. అక్కడ ఇటీవల నిర్మించిన పలు ప్రాజెక్టులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.


జూ పార్కులో గల సింహాల మోటులను పరిశీలిస్తున్న కాంతిలాల్, అటవీ శాఖ అధికారులు

కంబాలకొండలో వణ్యప్రాణి అభయారణ్యాన్ని సందర్శించి, సందర్శకులకు చక్కని ప్రకృతి అనుభూతి కలిగేలా వసతులు, సదుపాయాలు మెరుగు పరచాలని సూచించారు. నూతనంగా అభివృద్ధి చేసిన క్యాపిటేరియా, ఆంపై థియేటర్, కానోపి వాక్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. జూ లే ఆవుట్‌లో జాతుల వైవిధ్యాన్ని పరిశీలించారు.

వాచ్ టవర్ వల్ల పార్కులో ప్రత్యేకతను సంతరించుకుందని ప్రశంసించారు. అటవీ సంరక్షకులు బి.మహమ్మద్ ఇవాన్ షైథిన్, జూ క్యూరేటర్ జి.మంగమ్మ జూలో చేపడుతున్న పనులు, నిర్వహిస్తున్న కార్యక్రమాలు, జీవవైవిధ్యం, జూలో గల జంతు సంపద గురించి ప్రిన్సిపాల్ సెక్రటరీకి వివరించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కార్యదర్శి మాట్లాడుతూ విశాఖ జూను ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆయన జూ సిబ్బంది, జంతు సంరక్షులతో మాట్లాడారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా? అంటూ ఆరా తీశారు.

కృష్ణా కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మద్దిలపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 190 సీట్ల భర్తీ కోసం స్పాట్ అడిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు తెలిపారు. బీబీఏ లాజిస్టిక్స్-61, బీఎస్సీ ఆర్గానిక్ ఫార్మింగ్- 40, బీఎస్సీ బయో టెక్నాలజీ-17, బీఎస్సీ ఫిషరీస్-21, ఇతర గ్రూపుల్లో అడ్మిషన్లు చేపడుతున్నామన్నారు. 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లల్లో పాల్గొనేందుకు విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఒఎఎండీసీ-2025 ద్వారా ఇప్పటికే ఇతర కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులను అనర్హులని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా చేరిన అభ్యర్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి అర్హులు కాదని గ్రహించాలని విజ్ఞప్తి చేశారు.

సీఐఐ భాగస్వామ్య సదస్సు సూపర్ హిట్

» 'కోడిగుడ్డు మంత్రి' అర్థరహిత విమర్శలు కట్టిపెట్టాలి
» వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్



సిరిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు సూపర్ హిట్ అయిందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రెండురోజుల్లో జరిగిన సదస్సు 613 ఒప్పందాల ద్వారా రాబోయే రోజుల్లో రాష్ట్రానికి రూ.13 లక్షలకోట్లు పెట్టుబడులు రానున్నాయన్నారు. ఫ్యూచర్ రెడీ ఇన్నోవేషన్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. పెద్దఎత్తున ఒప్పందాలు జరగడం ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు రావడం వైసీపీ నేతలకు ఇష్టం లేనట్టుగా కనిపిస్తోందని విమర్శించారు. కోడిగుడ్డు మంత్రిగా పేరొందిన అమర్‌నాథ్ తమ హయాంలో ఎన్ని పెట్టుబడులు తీసుకొచ్చారో బహిరంగ పరచాలన్నారు. హైటెక్ సిటీతో హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని, అదే మాదిరి గూగుల్ రాకతో విశాఖపట్నం ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారబోతోందన్నారు. అభివృద్ధి చూసి, ఓర్వలేని వైసీపీ నాయకులు, బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, వారిని ప్రజలు అస్యహించుకుంటున్నారనే విషయాన్ని గమనిస్తే మేలన్నారు. రాజకీయ పబ్బం కోసం లేనిపోని విమర్శలు మానుకోని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు.

వయోపియా నేత్ర వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

» డాక్టర్ వరలక్ష్మి
» ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

బీచ్ రోడ్డు, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో వయోపియా వేగంగా పెరగడం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో వైద్యురాలు జీఎంఆర్ వరలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు వద్ద వయోపియా కంటి వ్యాధి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల పట్ల పిల్లల్లో సమీప దృష్టి లోపం అంటే దూరంగా ఉన్న వస్తువులు అస్పష్టంగా కనిపిస్తాయని, అలాగే దగ్గర వస్తువులు స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. వయోపియా ఉన్న వారిలో రెటీనా డిటాచ్‌మెంట్ కాంట్రాక్ట్ గ్లోకోమా వంటి ఇతర కంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. వయోపియాకు అద్దాలు, కాంటాక్ట్ లెన్స్‌లు, శస్త్ర చికిత్స వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వయోపియాతో బాధ పడుతున్న వ్యక్తికి దూరపు వస్తువులను చూడడంలో ఇబ్బందిగా ఉంటుందని, దీంతోపాటు ఆ వ్యాధికి అనేక లక్షణాలు ఉన్నాయన్నారు. మారుతున్న జీవనశైలి కారణంగా చిన్నారులు కూడా ఈ సమస్యకు గురవుతున్నారని వెల్లడించారు. అనంతరం ఆర్కే బీచ్ కాళీమాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఆప్తాలజిస్ట్ డాక్టర్ ఆదితి పారిఖ్, డాక్టర్ మీరేంద్ర సత్యదేవా, వైద్య సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్వీ ప్రసాద్ వైద్యశాల డాక్టర్ వరలక్ష్మి, సిబ్బంది, నేత్ర వైద్య విద్యార్థులు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల విజేత విశాఖ

లింగపాలెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల విజేతగా విశాఖపట్నం జట్లు నిలిచాయని స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండ లం ధర్మాజీగూడెంలో అండర్-19 రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి.

బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టుపై, బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై విశాఖపట్నం జట్లు విజ యం సాధించాయి. విజేతలకు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ట్రోఫీలు, బహుమతులు అందించి అభినందించారు.


క్రీడాకారులకు ట్రోఫీ అందిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్

సినిమా గైడ్

● **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతా రామయ్య (పరవాడ),
● **జిగ్రీస్** : జగదాంబ
● **శివ, రన్నింగ్ మాన్** : శారదా
● **దే దే ప్యార్ దే** : రమాదేవి
● **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
● **ది గర్ల్ ఫ్రండ్** :శ్రీకన్య, లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచర పాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
● **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 39, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 68, బెండకాయలు 60, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 58, బీరకాయలు 58, ఆనపకాయ 40, కాలీఫ్లవర్ 48, క్యాబేజి 26, క్యారెట్ 60, దొండకాయలు 60, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 72, అల్లం (పాతది) 64, బరబాటి 50, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 46, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, క్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

చంద్రబాబు, లోకేశ్‌ల వ్యూహాత్మక పనితీరుకు సీఐఐ సదస్సు నిదర్శనం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వ్యూహాత్మకంగా ఎంత శ్రమిస్తున్నారో నిదర్శనంగా సీఐఐ భాగస్వామ్య సదస్సు నిలిచిందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్‌పై గ్లోబల్ దృష్టిని మళ్లీ కేంద్రీకరించిందని, పెట్టుబడులకు ఏపీని గమ్యస్థానంగా నిలపడంలో చంద్రబాబు తన ప్రావీణ్యాన్ని నిరూపించారని పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను అనుసరిస్తుంటే, ఆంధ్రప్రదేశ్ అందుకు భిన్నంగా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను అనుసరిస్తుందోని తెలిపారు. ప్రతి రంగానికి స్పష్టమైన పాలసీలు రూకపల్పన చేసి, సింగిల్ విండో సిస్టమ్ ద్వారా పెట్టుబడులకు అన్ని అనుమతులు వేగంగా ఇవ్వడం వంటివి పరిశ్రమల ఆకర్షణకు ప్రధాన కారణంగా పేర్కొన్నారు. మొత్తం 613 ఒప్పందాల ద్వారా 13,25,716 కోట్ల పెట్టుబడులు, 16,13,188 ఉద్యోగాలు రావడం రాష్ట్ర అభివృద్ధి పట్ల పెట్టుబడిదారుల నమ్మకానికి ప్రత్యక్ష సాక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధిలో ఏపీ ఇక పరుగులు పెడుతుందన్నారు.

ముగిసిన నెరెడ్కో ప్రాపర్టీ షో

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో మూడు రోజులుగా జరుగుతున్న నెరెడ్కో ప్రాపర్టీ షో ఆదివారంతో ముగిసింది. చివరి రోజు సందర్శకులు పెద్ద ఎత్తున హాజరై స్థిరాస్తుల కొనుగోలుకు ఆసక్తి చూపారు. సీఐఐ సదస్సుల్లో రికార్డు స్థాయి లో రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరగడం, వాటిలో విశాఖ పరిసరాలకు ప్రాధాన్యం కల్పించడంతో కొనుగోలుదారుల్లో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది.

ఈ సందర్భంగా నెరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు చక్రధర్ మాట్లాడుతూ నగరంలో జరిగిన సీఐఐ సదస్సుల్లో రూ. 13 లక్షల కోట్ల ఒప్పందాలు జరగడంతో విశాఖ రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. త్వరలోనే అంతర్జాతీయ నగరంగా ఎదగడం ఖాయమని తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ప్రశాంత నగరమని, దేశ విదేశాల్లో ఉంటూ స్థిరాస్తులు కొనుగోలు చేసినా, ఆస్తుల భద్రతకు భరోసా ఉంటుందన్నారు. అన్ని అనుమతులతో నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నెరెడ్కో నమ్మకమైన సంస్థ అని పేర్కొన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టితో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందన్నారు. అచ్యుతాపురం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో నెరెడ్కో ఉత్తరాంధ్ర సలహా కమిటీ చైర్మన్ చోడే పట్టాభిరామ్, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు రమేశ్‌బాబు,విశాఖ నగర అధ్యక్షుడు రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు వెంకన్న చౌదరి, పాపారావు, సుబ్బారావు, మిథున్, ధర్మా, తదితరులు పాల్గొన్నారు.


నెరెడ్కో ప్రాపర్టీ షోకు వచ్చిన అతిథులకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రతినిధులు

ప్రీ మెచ్యూర్డ్ పిల్లల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

» నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
» బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీలు



అవగాహన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, తదితరులు



ర్యాలీ నిర్వహిస్తున్న రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, ఏవీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్లు, విద్యార్థులు

బీచ్ రోడ్డు, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : నేడు తల్లికి నెలలు నిండకుండానే పిల్లలు పుడుతున్న కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, ఇలా జన్మించిన పిల్లల్లో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమవుతున్నాయని, ఈ సవాల్‌ను అధిగమించేందుకు ఆరోగ్యపరంగా పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ ప్రీ మెచ్యూరిటీ దినం సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నెలలు నిండకుండా పుట్టిన శిశువుల విషయంలో అదనపు సంరక్షణ అవసరమని, వారి ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్త వహించాల్సి ఉంటుందన్నారు. శిశువుల పట్ల ఇన్ఫెక్షన్లు, అలర్జీల నుంచి కాపాడడం చాలా అవసరమని ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలకు ఎప్పటికప్పుడూ ఆరోగ్య పరీక్షలు చేయిస్తుండడం చేయించాలని సూచించారు.

డాక్టర్ సాయి సునీల్‌కిశోర్ మాట్లాడుతూ గర్భం దాల్చిన 37 వారాలకు ముందుగానే శిశువు జన్మించినట్లతే ఆ శిశువును ప్రీమెచ్యూరిటీ శిశువుగా పరిగణిస్తారని చెప్పారు. ఈ విషయంలో అందరికీ అవగాహన కల్పించేందుకే అంతర్జాతీయ ప్రీ మెచ్యూరిటీ దినాన్ని జరుపుకుంటున్నట్టు తెలిపారు.

అనంతరం ఆర్కే బీచ్‌లోని కాళీమాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యాధికారులు, పలువురు వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెయిన్ బో చిల్డ్రన్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో..

గర్భం దాల్చిన 37 వారాల ముందుగానే శిశువు జన్మించినట్టయితే వైద్యులు ఆ శిశువును ప్రీ మెచ్యూరిటీగా పరిగణిస్తారని రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జోనల్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ ప్రీ మెచ్యూరిటీ దినోత్సవం సందర్భంగా బీచ్ రోడ్డు వద్ద వాక్‌దాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలు నిండకుండా పుట్టే పిల్లలు పెరిగే కొద్దీ ఎదుర్కొనే ఆరోగ్య సవాళ్ల గురించి వివరించారు. ఇలా నెలలు నిండకుండా పుడుతున్న శిశువులు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా మస్తిష్క, పక్షపాతం, పెరుగుదలలో ఆలస్యం, వినికిడి సమస్యలు, దృష్టి సమస్యలు ఎక్కువగా ఉంటాయని వెల్లడించారు. బిడ్డకు తల్లి స్పర్శ చాలా అవసరమని, నెలలు నిండని శిశువుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంటుందన్నారు. 2025 ఆరోగ్య సర్వే ప్రకారం భారతదేశంలో నవజాతి శిశువుల మరణాలకు నెలలు నిండ కుండా జన్మించడం కూడా ఒక ప్రధాన కారణమన్నారు. దాదాపు 13 శాతం మంది పిల్లలు ముందస్తు శిశువులుగా జన్మిస్తున్నారని, 17 శాతం మంది తక్కువ బరువుతో జన్మిస్తున్నారని సర్వేలో వెల్లడైందన్నారు. ఆస్పత్రి వైద్యులు కన్సల్టెంట్ నియోనాటాలాజిస్ట్ డాక్టర్ బి.వినయ్ మాట్లాడుతూ ముందస్తుగా జన్మించే శిశువులు ఎదుర్కొనే ఆరోగ్య ఇబ్బందులు వాటిని నివారించే అంశాలపై అవగాహన చాలా అవసరమన్నారు.

అనంతరం ఆర్కే బీచ్ నుంచి కాళికామాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెయిన్‌బో ఆస్పత్రి డాక్టర్ మండుశా ఫణిప్రియా, గైనకాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ రాగసుధ, డాక్టర్ నిహారిక, డాక్టర్ ఎంవీఆర్ శైలజ, మెడికల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటుపై మాట తప్పిన కూటమి నేతలు

» వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

మద్దిలపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు మాట తప్పారని వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కెకె రాజు విమర్శించారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ జరగకుండా చూస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తన కుమారుడు లోకేశ్ రాజకీయ భవిష్యత్తు కోసమే ప్లాంటు ప్రైవేటీ కరణకు చంద్రబాబు సహకరిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు కన్ను స్టీల్‌ప్లాంటు భూములపై పడిందని ఆరోపించారు. ఇప్పటికే ఉత్తరాంధ్రలోని భూములను పప్పుబెల్లంలా పంచి పెట్టారన్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా జగన్ నాయకత్వంలో స్టీల్‌ప్లాంటును పరిరక్షించుకుంటామన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నేత మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సామూహిక వ్రతాలు

ఆరిలోవ నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయిబాబా శతవార్షిక జన్మ దినోత్న దినోత్సవాల్లో భాగంగా ఆరిలోవ బీటీఆర్ నగర్ ఓంకార మందిరం ఆరిలోవ భజన మండలి సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్యసాయి వ్రతాలను నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య తొలుత వినాయక పూజను చేశారు. సాయిబాబాకు గులాబీలతో పూజలు నిర్వహించారు.

ముందే ప్రసవ వేదన



కొన్నాళ్లుగా పెరుగుతున్న ముందస్తు ప్రసవాలు

- ప్రి మెచ్యూర్ బేబీల ఆరోగ్యం పట్ల అప్రమత్తం అవసరం
- అవగాహన లేకపోతే మరణాలకు అవకాశం
- నేడు వరల్డ్ ప్రిమెచ్యూరిటీ డే

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : **ఇటీవల కాలంలో ముందస్తు ప్రసవాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గర్భం దాల్చినప్పటి నుంచి 40 వారాలు దాటిన తరువాత మాత్రమే ప్రసవించాలి. కానీ అనేక కారణాల వల్ల కొందరు గర్భిణుల్లో ముందస్తు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇలా పుట్టే చిన్నారులను ప్రి మెచ్యూర్ బేబీ అంటారు. ఈ తరహా జన్మించే చిన్నారుల్లో అనేక అనారోగ్య సమస్యలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాటిపై అవగాహన కలిగించే ఉద్దేశంతోనే ఏటా నవంబరు 17న వరల్డ్ ప్రిమెచ్యూరిటీ డే నిర్వహిస్తున్నారు.**

గర్భం దాల్చిన తరువాత 38 నుంచి 40 వారాల మధ్య ప్రసవం జరుగుతుంది. అయితే కొన్ని కారణాల వల్ల 37 వారాల కంటే ముందుగా ప్రసవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలా పుట్టే శిశువుల్లో అనేక అనారోగ్య సమస్యలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా 27 వారాల నుంచి 25 వారాల్లోపు జన్మించే వారిలో తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉండే అవకాశం ఉంది. వీరికి మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా కోలుకునేలా చేస్తారు. కొన్నిసార్లు గర్భిణుల్లో బీపీ, షుగర్ పెరిగినా, బిడ్డ ఎదుగుదల తక్కువగా ఉన్నా, ఉమ్మనీరు ఆశించిన స్థాయిలో లేకపోయినా



ముందస్తు ప్రసవాలు జరుగుతుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా కోటిన్నర మంది చిన్నారులు ముందుగా పుట్టేస్తున్నారు.

నవజాత శిశువుల్లో సమస్యలు..

ప్రి మెచ్యూర్ బేబీల్లో కొన్ని రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఊపిరితిత్తులు, గుండె, మెదడు, నాడీ, జీర్ణ వ్యవస్థ పూర్తిస్థాయిలో ఎదగవు. వెంటిలేటర్ సహాయంతో చిన్నారికి కృత్రిమ శ్వాస అందిస్తారు. ఐవీ ద్వారా పోషకాలు ఇస్తారు. నాడీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు ఇంక్యుబేటర్స్‌లో పెట్టాల్సి వస్తుంది. ఈ చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతుంటాయి.

ఈ జాగ్రత్తలు అవసరం..

గర్భిణి పోషకాహారం తీసుకోవాలి. నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా, ఎనీమియా వంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. ఇకపోతే యూరినరీ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడే వారిలో ప్రిమెచ్యూర్ డెలివరీలు ఎక్కువగా అయ్యే అవకాశం ఉంది. ఫ్లూ జ్వరాలు, డయాబెటిస్ సమస్య, గర్భం దాల్చిన తరువాత బరువులు ఎత్తే పనులు చేసే వారిలో రక్తహీనత, గుండె జబ్బులు, బీపీ, ఇతర అనారోగ్య సమస్యలు, ఉమ్మనీరు లీక్ కావడం వంటి ఇబ్బందుల వల్ల ముందస్తు ప్రసవాలు జరుగుతాయి.

వైద్యుల సూచనలు పాటించాలి

- డాక్టర్ ఐ. వాణి, కేజీహెచ్ సూపరింటెండెంట్



గర్భం దాల్చిన తరువాత నుంచి తగిన పోషకాహారం తీసుకోవడంతో పాటు వైద్యులు సూచించే పరీక్షలు, స్కానింగ్ వంటివి చేయించుకోవాలి. కొన్నిసార్లు ఇబ్బంది ఉంటే ముందుగా గుర్తించి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తాం. ఒక్కోసారి అవసరం లేకపోయినా ప్రిమెచ్యూర్ డెలివరీ అవుతుంది. కొన్నిసార్లు యూట్రస్‌లో ఇబ్బందుల వల్ల ప్రిమెచ్యూర్ డెలివరీ చేయించాల్సి వస్తుంది. ప్రిమెచ్యూర్ డెలివరీ పట్ల అవగాహన ఉండడం చాలా అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో అకస్మాత్తుగా ఇబ్బందులు ఎదురై ప్రసవాలు జరుగుతుంటాయి. అటువంటి బిడ్డలకు మెరుగైన వైద్య సేవలందించాలి. ప్రతి పది మంది గర్భిణుల్లో ఒకరికి ఈ తరహా డెలివరీ అవుతుంటుంది.



విమాన్‌నగర్‌లో కొలువైన వైకుంఠ వేంకటేశ్వరాలయంలో ఆదివారం విష్ణు సహస్రనామ పారాయణం చేపట్టారు. 28సార్లు సామూహికంగా భక్తులు పఠించారు. -ఎన్ఏడీ జంక్షన్, ఆంధ్రజ్యోతి

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

మల్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 59వ వార్డు శాంతిగిరి కాలనీలో ఇళ్లు దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబాలకు ఎమ్మెల్యే గణబాబు సూచన మేరకు టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు నిత్యవసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. ప్రభుత్వం తరఫున సహాయం అందించడానికి చొరవ తీసుకుంటామన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు పూడి భాస్కర్ తన వంతు సహాయం అందించారు. టీడీపీ వార్డు నాయకులు ఉరుకూటి హరిబాబు, మిత్తిరెడ్డి శంకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో బ్యాక్‌లాగ్!

... 5వ పేజీ తరువాయి

లేక, గత నోటిఫికేషన్ మేరకు చర్యలు తీసుకున్నారా అనేది అంతుపట్టని ప్రశ్నగా మారింది. అదే సమయంలో మెరిట్ జాబితాను అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపర్చలేదు. సాధారణంగా వర్సిటీలో ఎటువంటి నియామకాలు చేపట్టినా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. కానీ ఈ పోస్టుల విషయంలో ఆ పద్ధతి పాటించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వుల ను కూడా వ్యక్తిగతంగా అందించారు. అంతేకాకుండా నగరంలోని ఒకే ప్రాంతానికి చెందిన నలుగురికి బ్యాక్‌లాగ్ పోస్టుల్లో ఉద్యోగాలు వచ్చినట్టు చెబుతున్నారు. దీంతో ఉన్నతస్థాయి ఒత్తిళ్ల మేరకు ప్రక్రియను చేపట్టి ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులే ప్రకటించాలి..

నిబంధనలకు అనుగుణంగా నియామక ప్రక్రియను చేపడితే అధికారులు వెల్లడించాలని పలువురు కోరుతు న్నారు. ఈ వ్యవహారంపై కొందరు కోర్టును ఆశ్రయించేం దుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. ఇప్పటికైనా ఏయూ ఉన్నతాధికారులు నియామక ప్రక్రియపై ప్రకటన విడుదల చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఐ బొమ్మ రవి ఇంట్లో సోదాలు?

... 5వ పేజీ తరువాయి

అతని ఇంట్లో సోదాలు చేశారని నగరంలో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. దీనిపై విశాఖ నగర పోలీస్ ఉన్నతాధికారులతోపాటు, ఆరిలోవ పోలీసులను ఆరా తీయగా తమకు ఎలాంటి సమాచారం లేదని, తనిఖీల ప్రచారాన్ని ఖండించారు. రవి తండ్రి ఒక్కరే ప్రస్తుతం పెదగదిలిలోని ఇంట్లో నివసిస్తున్నట్టు తెలిసింది.

సీసీఎస్ నిర్వహణకు టెండర్లు

... 5వ పేజీ తరువాయి

ప్రాజెక్టులను తనిఖీ చేశారు. టౌన్‌కొత్తరోడ్డు వద్ద ఒక హూపర్ పనిచేయడం లేదని, ఓపెన్‌టిప్పర్లతో చెత్తను రాత్రిపూట తరలిస్తున్నట్టు గుర్తించారు. గాజువాకలో హుక్‌లోడర్ ఏడాది కిందట రోడ్డుప్రమాదానికి గురైతే ఆ వాహనం తిరుగుతున్నట్టు చూపించి డీజిల్ తీసుకుంటున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో రెండు సీసీఎస్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ నుంచి రూ.56 లక్షలు రికవరీ చేసి, బాధ్యతల నుంచి తొలగించాలని ఆదేశించారు.

నోటీసులతో సరి

అయితే మెకానికల్ అధికారులు కాంట్రాక్టర్‌కు టెర్మినేషన్ నోటీసు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. కమిషనర్ ఆదేశించి రెండునెలలు గడుస్తున్నా ఇంతవరకు రూ.56 లక్షలు రికవరీ చేయలేదు. తాజాగా సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణకు సుమారు రూ.ఏడు కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలవడంతో సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటే టెండర్లకు అర్హత కోల్పోతాడు. చర్యలపై తాత్సారం చేస్తే టెండర్‌లో పాల్గొనే వీలుంటుందని, ఇందుకు అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టిసారించి నిబంధనలు అతిక్రమించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతున్నారు.

నగరంలో ఐకానిక్ భవనం

... 5వ పేజీ తరువాయి

నెలాఖరు, మిగిలినవి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్/బీపీఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని, తద్వారా సంస్థకు ఆర్థిక పరిపుష్టి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తవలసలో 120 ఎకరాలు, శొంఠ్యాంలో 80 ఎకరాల్లో థీమ్ బేస్డ్ సిటీస్ నిర్మాణం, ల్యాండ్ పూలింగ్, పీపీపీ ప్రాజెక్టుల స్థితిగతులపై ఆరా తీసి, పలు సూచనలు చేశారు. సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్, జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీ కృష్ణ, ప్రధాన ప్రణాళిక అధికారి శిల్ప, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, జీవీఎంసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విశాఖకు విశ్వ ఖ్యాతి

... 5వ పేజీ తరువాయి

గూగుల్ వంటి సంస్థ విశాఖను ఎంచుకోవడంతో నగరం ప్రాముఖ్యత తెలుసుకునేందుకు పలుదేశాల ప్రతినిధులు వచ్చారు. ఇక్కడి అతిథి మర్యాదలు, విశాఖలో సుందర దృశ్యాలు, వనరులు వారిని మంత్రముగ్ధులను చేశాయి. పెట్టుబడుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పలువురు కంపెనీ ప్రతినిధులు పరిశీలించి హామీలు ఇచ్చారు. పెట్టుబడులు కోసమే కాదని, నాలెడ్జిని ఇచ్చి పుచ్చుకోవడం, కొత్త ఆవిష్కరణలపై చర్చలు చేపట్టడంపై విశ్లేషణలకు సదస్సు వేదికగా మారిందని ప్రశంసించారు.

రిలయన్స్ డేటా సెంటర్

విశాఖలో గూగుల్ కంపెనీ ఒక గిగా వాట్ సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రకటన చేయడంతో ప్రపంచంలో అనేక కంపెనీల కన్ను విశాఖ వైపు పడింది. ఈ నేపథ్యంలో రిలయన్స్ సంస్థ ఒక గిగావాట్ సామర్థ్యంతో విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించింది. దీనికితోడు మరో కంపెనీ కూడా డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. పలు ఐటీ కంపెనీలు విశాఖలో తమ శాఖలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి. త్వరలో టీసీఎస్, కాగ్నిజెంట్ కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ఇన్ఫోసిస్ విశాఖ సెంటర్‌ను విస్తరించనున్నది. ఈ నెల 13వ తేదీన ఐటీ మంత్రి లోకేశ్ రుషికొండ ఐటీ సెజ్‌లో పలు కంపెనీలకు శంకుస్థాపన చేశారు. మరికొన్ని కంపెనీలు నగరంలో తమ కార్యకలాపాలు నిర్వహిచేందుకు ఆసక్తి చూపాయి. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు లోకేశ్ శంకుస్థాపనచేశారు.

పర్యాటక రంగానికి ఊతం

జలవిహార్ గ్రూప్ మధురవాడలో టూరిజం పార్కు ఏర్పాటు చేయనుంది. సన్ ఇన్‌స్టిట్యూట్ రూ.150 కోట్లతో బీచ్‌రోడ్డులో హోటల్ నిర్మించనున్నది. భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు మరికొన్ని సంస్థలు ఉత్సాహం చూపిస్తున్నాయి. క్రూయిజ్ వ్యాపార విస్తరణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. విశాఖ నుంచి చెన్నై వరకు నడుపుతున్న సీ క్రూయిజ్ ఫ్రీక్వెన్సీ పెంచేందుకు నిర్ణయించారు. విశాఖ శివారున హిందూజా గ్రూప్ థర్మల్‌ప్లాంట్‌ను విస్తరించనుంది. నక్కపల్లి సమీపంలో స్టీల్ సిటీ రానున్నది. పరవాడ, అచ్యుతాపురం ఫార్మాసిటీలలో పలు ఔషధ కంపెనీలు కొత్త యూనిట్లు ఏర్పాటుచేస్తున్నాయి. భాగస్వామ్య సదస్సు నిర్వహణ ద్వారా విశాఖలో పెట్టుబడులకు అవకాశాలు పెరిగాయని పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.ఇది నగరాభివృద్ధికి దోహదపడడంతో పాటు ఉత్తరాంధ్ర పరిధిలోని యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని చెబుతున్నారు.

ఈత పోటీల్లో ఓవరాల్ చాంప్ విశాఖ

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర, బాలికల ఈత పోటీల్లో విశాఖ ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. విశాఖ స్విమ్మర్లు నాలుగు స్వర్ణ, ఏడు రజత, తొమ్మిది కాంస్య పతకాలతో 90 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో విశాఖకు చెందిన వేదాంత్ గౌతమ్ పంచల్ రెండు స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో వ్యక్తిగత ఛాంపియన్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. జిల్లా సంఘం ప్రతినిధులు మోహన వెంకటరామ్, సంతోష్‌కుమార్ శెట్టి, జి.శ్రీరామమూర్తి, ఎన్.రఘునాధరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి

కంచరపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. గవరకంచరపాలెం వెలమవీధి సమీపంలో రైల్వే ట్రాక్‌ను ఆనుకుని ఉన్న చెట్ల పొదలో ఓ వ్యక్తి చెట్టుకు వేలాడుతూ ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి ఒంటిపై నల్లరంగు ప్యాంటు, ఆరెంజ్ రంగు చొక్కా ఉన్నాయి. నల్లని చెప్పులు ధరించి ఉన్నాడని తెలియజేశారు. 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందని, పది రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుని బంధువులు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. సీఐ కె.రవికుమార్ నేతృత్వంలో ఎస్.ఐ. రవి కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి జారిపడి తాపీ మేస్త్రీ మృతి



మాధవధార, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధి కాకానినగర్‌లో మూడంతస్థుల భవనం పైనుంచి జారిపడి తాపీమేస్త్రీ మృతి చెందాడు. స్థానికులు, ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఏడీ కొత్తరోడ్డు విమాన్‌నగర్ రజకుల వీధిలో చిలకలపల్లి శ్రీను భార్య విజయలక్ష్మి, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం మీసేవ ఎదురుగా ఉన్న మూడంతస్థుల భవనంలో పని కోసం వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వెళ్లాక, మళ్లీ పనిచేసే భవనం వద్దకు కూలి డబ్బుల కోసం వచ్చాడు. బిల్డింగ్ ముందు ఎలివేషన్ కోసం కట్టిన పరంజి మీద నుంచి రేకులు అందిస్తుండగా, ప్రమాదవశాత్తూ కాలు జారి మూడో అంతస్థు నుంచి పడిపోయాడు. చిలకలపల్లి శ్రీను తల, ఎడమ కాలు, కుడి చేతికి తీవ్ర గాయాలవడంతో చికిత్స నిమిత్తం 108లో కేజీహెచ్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ప్రకటించారు.

ఉచిత నేత్ర వైద్యపరీక్షలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కోరమాండల్ కంపెనీ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు

మల్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం సౌజన్యంతో ములగాడలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 383 మందికి కంటివైద్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన కోరమాండల్ యూనిట్ హెడ్-వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (హెచ్ఆర్) కేవీవీఎస్ నారాయణ, ములగాడ గ్రామ అధ్యక్షుడు డి.వేణుగోపాల్‌రెడ్డి, ప్రతినిధులు జి.రామచంద్రారెడ్డి, పి.నారాయణరెడ్డి, జి.రమణరెడ్డి పాల్గొన్నారు.

మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు

- ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

అక్కయ్యపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేడు 80 నుంచి 85 శాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదం వల్లే జరుగుతున్నాయని ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. రైల్వే న్యూకాలనీలోని బ్రహ్మకుమారీల ఈశ్వరి విశ్వవిద్యాలయంలో ఆదివారం సాయంత్రం 'యునైటెడ్ నేషన్స్ వరల్డ్ డే ఆఫ్ రిమెంబర్స్ ఫర్ రోడ్డు ట్రాఫిక్ విక్టిమ్స్' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ యశ్వంత్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, అవయవాలు కోల్పోవడం లేదా గాయం తగలడాన్ని చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. కానీ హెల్మెట్ ధరించకపోవడం వల్ల చాలా ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. జిల్లా రవాణా శాఖ కమిషనర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాస్, బ్రహ్మకుమారిస్ రైల్వేన్యూకాలనీ బ్రాంచ్ ఇన్‌చార్జ్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి శతజయంతి వేడుకలు



నిరుపేదలకు నిత్యావసరాల్ని అందిస్తున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, భజనమండలి సభ్యులు

మురళీనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మురళీనగర్ సత్యసాయి భజనమండలిలో జరిగిన ప్రత్యేక ఆరాధనలో ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వామికి విశేష పూజాహారతి అందించారు. అనంతరం సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు నిత్యావసర సరుకుల్ని ఎమ్మెల్యే అందించారు. వందలాది మంది పాల్గొన్నారు. మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రవిత్రోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయ వర్గాలు ఆయనకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషస్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, వేదాశీర్వచనం అందించారు.

ఘనంగా కార్తీక సమారాధన కార్యక్రమాలు



కేదారేశ్వర ఆలయంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

గోపాలపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని పలు ఆలయాల్లో ఆదివారం కార్తీక అన్న సమారాధన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కొత్తపాలెం శివారు భగత్‌సింగ్ నగర్‌లో గణపతి సహిత గౌరీ కేదారేశ్వర ఆలయంలో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గోపాలపట్నం చంద్రమౌళీశ్వర ఆలయంలో జరిగిన కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్ఆర్ వెంకటాపురంలో కొలువైన ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని జనసేన నేత బెహరా భాస్కరరావు ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కళింగ వైశ్యుల అభ్యున్నతికి కృషి

వేపగుంట: నగరంలో కళింగవైశ్య సోదరుల సంక్షేమానికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ప్రభుత్వ విప్ గణబాబు పేర్కొన్నారు. సింహాచలం గోశాల దరి మామిడితోటలో ఆదివారం గోపాలపట్నం కళింగవైశ్యుల కార్తీక వన సమారాధన కార్యక్రమంలో మాట్లాడారు. అందరూ ఐక్యంగా ఉండి నిరుపేదలకు సహాయం చేయాలన్నారు. ఆటపాటలతో సందడి చేశారు. వివిధ రంగాల్లో సేవచేసిన వారిని సన్మానించారు. కళింగ వైశ్య నగర అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, గోపాలపట్నం అధ్యక్షుడు మధుసూదనరావు, కార్యదర్శి శంకరరావు, గుడ్ల మిన్నారావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులను ఆదుకుంటాం: గణబాబు

మల్కాపురం: ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే ఆ సామాజిక వర్గానికి సహకారం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. ఆదివారం మాతా కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సంఘం నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కోరాడ శ్రీనివాసరావును సత్కరించారు.

ఘనంగా పూజా మహోత్సవం

గోపాలపట్నం: స్థానిక కోటనరవలో గౌరీ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి సన్నిదానంలో ఆదివారం రాత్రి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 3 వేల మంది పాల్గొన్నారు.

రైతుబజారు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక : ఎమ్మెల్యే గణబాబు



మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్ కిరణ్‌కు సూచనలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతుబజారు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. స్థానిక రైతుబజారును ఆదివారం సందర్శించిన ఆయన రద్దీ కారణంగా ఎదురవుతున్న ఇబ్బందుల్ని పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్ కిరణ్‌తో చర్చించారు. కొనుగోలుదారుల రాకపోకలకు వీలుగా ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని ఆక్రమణకు గురవుతున్న రైతుబజారు స్థలం పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక సమర్పించాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు సూచించారు. మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఎలమంచిలి అపర్ణ, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అపార అనుభవం, దూరదృష్టితో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ వ్యూహాత్మకంగా చేసిన కృషికి ఫలితమే సీఐఐ సమ్మిట్ విజయానికి కారణమని అన్నారు. జగన్‌రెడ్డి విధ్వంస పాలనకు భయపడి రాష్ట్రాన్ని విడిచివెళ్లిన కంపెనీలు నేడు చంద్రబాబు అనుసరిస్తున్న విధానాలకు ఆకర్షితులై తిరిగి వచ్చాయన్నారు.

ఘనంగా క్రీస్తురక్షకుని యాత్ర మహోత్సవం



క్రీస్తు స్వరూపాన్ని ఊరేగిస్తున్న విశ్వాసులు

జ్ఞానాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం రక్షణ గిరి పుణ్యక్షేత్రంలో ఆదివారం క్రీస్తు రక్షకుని యాత్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా నుంచి ఆర్‌సీఎం క్రైస్తవ విశ్వాసులు పాల్గొని ప్రార్థనలు చేశారు. ముఖ్యఅతిథిగా విశాఖ కేథలిక్ అగ్రపీఠాధిపతి ఆర్చ్ బిషప్ మోస్ట్ రెవరెండ్ ఉడుముల బాలశౌరి హాజరయ్యారు. బైబిల్ ఉజ్జీవ సభ భక్తిప్రపత్తులతో జరిగింది. సాయంత్రం ఏసుక్రీస్తు ప్రభువు స్వరూపంతో ప్రజలు జ్ఞానాపురం వీధుల్లో పుర ప్రదక్షిణ చేసి రక్షణ గిరి పైకి చేరారు. ఈ వేడుకలకు జ్ఞానాపురం విచారణకర్తలు ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, సహాయ విచారణకర్తలు ఫాదర్స్ ప్రేమ్ కుమార్, పిరికి థామస్, ముసులు రాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు పాములు పట్టివేత



నాలుగు పాములను విడిచిపెడుతున్న గణేష్

మల్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు..రెండు కాదు.. ఆదివారం సాయంత్రం ఏకంగా నాలుగు పాములను స్నేక్ క్యాచర్ ఆనంద్ శిష్యుడు గణేష్ ఒకేసారి పట్టుకొని బంధించి యారాడ రోడ్డులో విడిచిపెట్టారు. రెండు రోజుల వ్యవధిలో నాలుగు చోట్ల నాలుగు పాములు పట్టుకున్నాడు. వీటిని ఒకేసారి యారాడ రోడ్డులో విడిచిపెట్టారు. ఒక్కొక్క పాము దాదాపుగా ఆరు అడుగులు ఉంది. గణేష్ మాట్లాడుతూ పాములను చంపవద్దని, పాము కనిపించిన వెంటనే ఫోన్ చేస్తే సురక్షిత ప్రాంతంలో విడిచిపెడతామన్నారు. తనకు ఫోన్ (86881 45454) చేయాలని కోరారు.

దళారీ వ్యవస్థ నిర్మూలించి రైతులకు సహకారం: అయితి



సమావేశంలో పాల్గొన్న పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం తదితరులు

పెందుర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దళారీ వ్యవస్థను నిర్మూలించి... రైతులకు సహకారం అందజేస్తామని పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం అన్నారు. ఆదివారం పెందుర్తిలోని పీఏసీఎస్ కార్యాలయంలో రైతు ప్రయోజన కార్యక్రమాలపై సదస్సు నిర్వహించారు. సహకార సంఘాల సామాజిక, ఆర్థిక విజయాలను ప్రోత్సహించడానికి సదస్సులు దోహదపడతాయన్నారు. డీసీఎంఎస్ అనుసంధానంతో రైతులకు మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చిరికి అవతారం, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.నగేశ్, సంఘం కార్యదర్శి శంకరరావు, కొండబాబు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న పాఠకులు

పెందుర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండల శాఖ గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన, ఉద్యమకారుల సంస్మరణ, ధరావతు సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఎల్ఎస్ఎన్ మూర్తి పుస్తక ప్రదర్శన ప్రారంభించి మాట్లాడారు. సోషల్ మీడియా విశృంఖలత నేపథ్యంలో మంచి పుస్తకం చదవటం మానసిక వికాసానికి మేలన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి, గాడిచర్ల, పాతూరి, రంగనాథన్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి చంద్రకళ, గ్రంథాలయ కమిటీ కార్యదర్శి ఆడారి రామకృష్ణ పాల్గొన్నారు.

ఉక్కు అయ్యప్ప ఆలయంలో ఘనంగా పడిపూజ మహోత్సవం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం పడిపూజ



విద్యుద్దీప కాంతులతో ఆలయం



అలంకృతుడైన అయ్యప్పస్వామి

మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కేరళలోని సన్నిధానంలో నిర్వహించే విధంగా ఈ ఆలయంలో పూజలు నిర్వహిస్తారు.ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అనంతరం రాత్రి పడిపూజ కార్యక్రమం చేపట్టారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో పాటు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి 18 మెట్ల మార్గం వద్ద పడి వెలిగించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తి గీతాలను ఆలపించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు ఐదు వేల మంది భక్తులు పడిపూజ ఉత్సవంలో పాల్గొనగ, వీరందరికి పూజ అనంతరం ప్రసాదం అందించారు. ఆలయ కమిటీ కార్యదర్శి కేఎస్ఎన్ రావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైభవంగా పూజలు నిర్వహించారు.

71వ వార్డులో..

ఆటోనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 71వ వార్డు శ్రీనగర్‌లో గురుస్వాములు కరణం కనకారావు, గుంట సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. మామిడి తోరణాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. అరటి డొప్పలతో అంబలం నిర్మించి 18 సోపానాలను ఏర్పాటు చేసి బంతి, చామంతి, గులాబీ, లిల్లీ పూలతో అలంకరించారు, కలశ పూజ నిర్వహించారు. 18 సంవత్సరాలు మాలధారణ చేసి యాత్ర చేసిన గురుస్వాములను సత్కరించారు. గురుస్వాములు ఆధ్వర్యంలో వినాయకుడు, లక్ష్మీ దేవి, అయ్యప్పలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలలో వివిధ పుష్పాలతో, నిమ్మకాయల దండలతో అలంకరించారు. అయ్యప్ప స్వామి భక్తులు ఆలపించిన భజన గీతాలు ఆకట్టుకున్నాయి

సీఐఐ విజయవంతంతో రాష్ట్రాభివృద్ధి పరుగులు

» ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్



మాట్లాడుతున్న ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సీఐఐ సదస్సు విజయవంతమైందని, దీంతో రాష్ట్ర అభివృద్ధి మరింత పరుగులు తీస్తుందని గాజువాక టీడీపీ సమన్వయకర్త, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నూతన పారిశ్రామిక విధానానికి నాంది పలికిందని, ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడుదారులు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ పేరు ప్రపంచ వ్యాప్తంగా మంరి పేరు ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం విశాఖపట్నంను ఆక్రమాలు, దుర్మార్గాలు, ఆరాచకాలకు వేదికగా నిలిపారని, కానీ నేడు కూటమి ప్రభుత్వం విశాఖను పారిశ్రామికంగా వేదికగా నిలిపారన్నారు. కార్యక్రమంలో నాయకులు మొల్లి పెంటిరాజు, కె.శంకర్రావు, వియ్యపు కొండబాబు, పి.వెంకటేశ్వరరావు, సోమినాయుడు, అప్పలరాజు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఏపీకి బంగారు భవిష్యత్తు

అగనంపూడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో రెండు రోజుల పాటు నిర్వహించిన సీఐఐ సమ్మిట్ ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని ప్రపంచం నలుమూలులా వ్యాపింప జేయడంలో రాష్ట్ర ఇమేజ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సఫలీకృతుడయ్యారని కూటమి స్థానిక నేతలు పేర్కొన్నారు.ఆదివారం పీనమడక కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు కూటమి నేతలు మాట్లాడుతూ ఏపీకి చంద్రబాబుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. చంద్రబాబుపై నమ్మకంతోనే పలు దేశాల పారిశ్రామికవేత్తలు, కంపెనీలు ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నాయనారు. రాష్ట్ర ప్రగతే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గంతకోరు అప్పారావు, అండిబోయిన మంగరాజు, బి.సత్యనారాయణ, గురుమూర్తి, తాతారావు, విజయ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మేయర్ పీలా జన్మదిన వేడుకలు

పెందుర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగర మేయరు పీలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు పీలా యువ సేన ఆధ్వర్యంలో పెందుర్తిలో సోమవారం నిర్వహిస్తారు. పెందుర్తిలోని మేయరు పీలా స్వగృహంలో ఉదయం తొమ్మిది గంటలకు జరగనున్న పుట్టినరోజు వేడుకల్లో భారీ కేకును కత్తిరిస్తారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం, వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పెందుర్తి జంక్షన్‌లో పీలాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన అభిమానులు, టీడీపీ కార్యకర్తలు బ్యానర్లు, కటౌట్, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం నాలుగో ఆదివారం సందర్భంగా షీలానగర్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో సామూహిక సత్యన్నారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. దివ్యక్షేత్రంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై రమా సహిత సత్యన్నారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించిన వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు.

బీజేపీలో చేరిన దామా సుబ్బారావు



ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్న దామా సుబ్బారావు

కూర్మన్నపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గాజువాక నియోజకవర్గ పరిధిలోని 86వ వార్డు కూర్మన్నపాలేనికి చెందిన వైసీపీ మాజీ రాష్ట్ర నాయకుడు దామా సుబ్బారావు బీజేపీలో చేరారు. ఆరోగ్య శాఖామాత్యులు మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పి.పరశురామ్ రాజు సమక్షంలో నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ కండువా వేసుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దామా సుబ్బారావు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశ, రాష్ట్రాలను ప్రగతిపథంలో నడిపిస్తున్న తీరుకు ఆకర్షితుడినై బీజేపీలో చేరుతున్నట్టు చెప్పారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తానని, తనకు ఏ బాధ్యత అప్పగించినా సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి పాటు పడతానన్నారు. తాను గతంలో వైసీపీలో జిల్లా ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర అదనపు కార్యదర్శిగా, సీఈసీ సభ్యుడిగా పలు సేవలు అందించి పార్టీ అభ్యున్నతికి కృషి చేసినా, తనకు సముచిత స్థానం దక్కలేదన్నారు. దీంతో గత ఏడాది నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, నాలుగు నెలల క్రితం వైసీపీ పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేశానన్నారు. మిత్రులు, అభిమానులు, వార్డు నాయకులు, శ్రేయోభిలాషులు కోరిక మేరకు బీజేపీలో చేరానన్నారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తూ, కూటమి నాయకులతో కలసిమెలసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బీర్సాముండాకు ఘన నివాళి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ బీర్సాముండా 150వ జయంతి వేడుకలు స్టీల్ ప్లాంటు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్లాంటు ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ సెల్, రెడ్రెస్సెల్ కమిటీ చైర్మన్ ర వీంద్ర బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు

లక్ష్మీపురం కాలనీ లో బోరువెల్స్ ప్రారంభం

కూర్మన్నపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87వ వార్డు లక్ష్మీపురం కాలనీలో ఆదివారం కార్పొరేటర్ బొండా జగన్ బోరు బావులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బొండా జగన్ మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరించే దిశగా ఈ నూతన బోరులను వేశామన్నారు. దీంతో ఈ ప్రాంతంలో నీటి వారణ ఎద్దడి ఉండదన్నారు. అలాగే వార్డులో మరింత అభివృద్ధి చేపడతామన్నారు. వార్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో విజయరామరాజు, ప్రకాష్, రాజన్‌రాజు, పెంటారావు, రాము, శ్రీను, దానయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.